## దీపావళి రోజున తూటాలకు ఇద్దరు బలి..!

న్యూఢిల్లీ,దీపావళి రోజున దేశ రాజధాని ఢిల్లీలో విషాదకర ఘటన చోటు చేసుకుంది. షహదారా ప్రాంతంలో తుపాకీ తూటాలకు ఇద్దరు బలయ్యారు. మరో మైనర్ గాయాలకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఫార్స్ బజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం రాత్రి ఈ కాల్పుల ఘటన చోటు చేసుకుంది. మృతులు ఆకాశ్ (40), రిషబ్ (16) మృతి చెందగా.. క్రిష్ శర్మ (10) గాయపడినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. షహదారా ప్రశాంత్ గౌతమ్ మాట్లాడుతూ.. రాత్రి సమయంలో బిహారీ కాలనీలో కాల్పులు జరిగాయి.సంఘటనా స్థలానికి వెళ్లి చూడగా.. ఆకాశ్, అతడి మేనల్లుడు రిషబ్, కొడుకు క్రిష్‌కు గాయాలయ్యాయి. తీవ్ర గాయాలతో ఆకాశ్, రిషబ్ చనిపోయారని చెప్పారు. ప్రాథమిక విచారణలో ఐదురౌండ్లు క్పాలు జరిగినట్లుగా తేలింది. గుర్తు తెలియని వ్యక్తి తుపాకీ కాల్పులు జరిపే ముందు పాదాలను తాకాడు. ఆ తర్వాత కాల్పులకు పాల్పడ్డాడు. ఈ ఘటనలో ఆకాశ్ శర్మ పక్కనే ఉన్న రిషబ్, క్రిష్‌కు సైతం తూట గాయాలు అయ్యాయి. వారిని ఆసుప్రతికి తరలించారు.. ఆకాశ్ శర్మ, రిషబ్ చనిపోయినట్లుగా గుర్తించారు. క్రిష్ శర్మ చికిత్స పొందుతున్నట్లు పోలీసులు తెలిపారు.


# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 09 సంచిక :217 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేదీ: శనివారం 02-11-2024 | పేజీలు:4 వెల: 2.00


## రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర చేస్తా: కేటీఆర్



హైదరాబాద్: పార్టీ కార్యకర్తలు అంతా కోరుతున్నందున భవిష్యత్తులో రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర చేస్తానని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ (కేటీఆర్) అన్నారు. ఎక్స్ వేదిగా నిర్వహించిన 'ఆస్క్ కేటీఆర్' క్యాంపెయిన్‌లో యూజర్లు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. దేశంలోని అనేక పార్టీల నేతలు ప్రభుత్వాల వైఫల్యాలను ఎండగట్టడంతోపాటు, పార్టీలను బలోపేతం చేసేందుకు పార్టీ అధ్యక్షులు పాదయాత్రలు చేస్తున్నారు, మీరెప్పుడు చేస్తారని అడిగారు. దీనికి స్పందించిన కేటీఅర్ ఖచ్చితంగా తన పాదయాత్ర ఉంటుందని వెల్లడించారు.దాదాపు గంటన్నపాటు సాగిన ఈ సంభాషణలో కేటీఆర్ అనేక అంశాలపై తన అభిప్రాయాలను పంచుకున్నారు.

తెలంగాణకు శాపం కాంగ్రెస్

కాంగ్రెస్ పాలన తెలంగాణకు ఒక శాపంగా మారిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే ఉద్దేశం ఏమాత్రం లేదు. అందుకే అబద్ధాలు, అసత్యాల మీద సమయం గడుపుతూ ప్రజలను మోసం చేస్తున్నది. గత పది నెలల కాలంలో కాంగ్రెస్ పార్టీ చేసిన ఒక్క మంచి కూడా గుర్తుకు రావడం లేదు. అబద్ధపు హామీల మీద ఎన్నికైన కాంగ్రెస్ పార్టీ నుంచి ఇంతకంటే గొప్ప పరిపాలన ఆశించలేం. తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు రాజకీయ వేధింపులను ప్రారంభించింది. అయితే వీటికి భయపడేది లేదని కేటీఆర్ స్పష్టం చేశారు. సన్నవడ్లకు కూడా బోనస్ ఇస్తామన్న కాంగ్రెస్ పార్టీ హామీ బోగస్‌గా మారిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నమ్మి ఓట్లు వేసి మద్దతు ధర లేక రైతుబంధు లేక నష్టపోతున్న రైతన్నల తరఫున పోరాడుతామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ పాలన ఫ్రమ్ ఢిల్లీ, టూ ఢిల్లీ, ఫర్ డీల్లీ అన్నట్లుగా తయారైందని ఎద్దేవా చేశారు.

తెలంగాణ కోలుకోవడం అసాధ్యం

నాలుగేండ్ల తర్వాత కాంగ్రెస్ పార్టీ అధికారం పోవడం ఖాయమని కేటీఆర్ అన్నారు. అయితే కొత్త ప్రభుత్వానికి ప్రస్తుత సర్కార్ చేసిన నష్టం నుంచి తెరుకొని ముందుకు తీసుకుపోవడం అతిపెద్ద సవాలుగా మారుతుందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర ఆర్థిక ప్రగతి పూర్తిగా పతనమైందని చెప్పారు. అన్ని రంగాల్లో తెలంగాణ రాష్ట్రం వెనక్కి పోతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ఆదాయ వనరులు నుంచి మొదలు వ్యవసాయ రంగం, అన్ని రంగాలు తిరోగమనంలో ఉన్నాయన్నారు. నిరుద్యోగిత పెరిగిందన్నారు. తెలంగాణ నుంచి అనేక కంపెనీలు వెనక్కి వెళ్లిపోతున్నాయని చెప్పారు. ఈ అంశాల్లో రాష్ట్ర ప్రభుత్వానికి ఎలాంటి ప్రణాళికలు ఉన్నాయో ఎవరికీ తెలియడం లేదన్నారు. కాంగ్రెస్ పాలన వలన జరుగుతున్న నష్టాన్ని పూడ్చుకోవడం అప్పుడప్పుడే సాధ్యం కాదు అన్నారు.

ప్రజల పక్షాన కొట్లాడటమే..

ప్రస్తుతం ప్రధాన ప్రతిపక్ష బాధ్యతలు నిర్వహించడం పైన ప్రధానంగా దృష్టి సారించామని తెలిపిన కేటీఆర్, ఈ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుతో పాటు తీసుకున్న నిర్ణయాలలో పారదర్శకత పైన ప్రజల తరఫున కొట్లాడుతామన్నారు. కాంగ్రెస్ పార్టీ పట్ల అప్పుడే బలమైన ప్రజా వ్యతిరేకత ఉన్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీని రాజ్యాంగబద్ధంగా మార్చే అవకాశం ఉన్నదా అని ఒకరు అడిగిన ప్రశ్నకు సమాధానంగా మరో నాలుగు సంవత్సరాలు వేచి ఉండాల్సిందే అన్నారు. అయితే ప్రజలు ఐదు సంవత్సరాల కోసం కాంగ్రెస్ పార్టీకి అవకాశం ఇచ్చారు కాబట్టి దాన్ని గౌరవించాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యమంత్రి ఐదేండ్లు పూర్తికాలం పదవిలో ఉంటారా లేదా ఓటుకు నోటు కేసు వల్ల బీజేపీకి వెళ్తాడా అని ఒకరు అడిగిన ప్రశ్నకు సమాధానంగా రాజకీయాల్లో ఏదైనా జరుగుతుందని, ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ చరిత్ర చూస్తే ఎప్పుడు ఎలాంటి పరిణామైనా జరగవచ్చని చెప్పారు.

రాజకీయాల్లోకి కుటుంబాలను లాగడం నీచం

తాము అధికారంలో ఉన్న పదేండ్లలో ఏనాడూ ఇతరుల కుటుంబ సభ్యులను రాజకీయ అంశాల్లోకి లాగలేదు. దాదాపు రెండు దశాబ్దాల తన రాజకీయ జీవితంలో కుటుంబ సభ్యులను అవహేళన చేసి మాట్లాడినప్పుడు, రాజకీయాలు వదిలేయాలన్నంత భావోద్వేగానికి గురైన విషయాన్ని కేటీఆర్ ప్రస్తావించారు. కేవలం రాజకీయాల కోసం ఇతరుల కుటుంబ సభ్యులను ఎందుకు లాగుతారో అర్థంకాదని, ఈ విషయం తనకు అత్యంత బాధ కలిగిస్తుందన్నారు.నీచమైన రాజకీయాల కోసం తన కుటుంబాన్ని లాగుతున్న ముఖ్యమంత్రి పైన, ఆయన వందిమాగదుల పైన ప్రజల మద్దతుతో పోరాటం చేస్తానని చెప్పారు.

మూసీ, హైడ్రా పై..

చెరువుల సంరక్షణ పేరుతో ప్రభుత్వం పేపర్ మీద గొప్పలు చెబుతున్నప్పటికీ అసలైన ఎజెండా అవినీతి మాత్రమే. మూసీ బ్యూటిఫికేషన్‌కి తాము వ్యతిరేకం కాదు. కానీ మూసీ లూటిఫీకేషన్‌కి వ్యతిరేకం. మూసీ ప్రక్షాళణ దేశంలోనే అతిపెద్ది అవినీతి స్కాం అవుతుంది. హైడ్రా కేవలం కొందరిని మాత్రమే లక్ష్యంగా చేసుకొని పనిచేస్తుంది. ఇప్పటిదాకా ఒక్క పెద్ద బిల్డర్‌ని కూడా హైడ్రా ముట్టుకోలేదు. కేవలం పేదలను మధ్యతరగతి ప్రజలను మాత్రమే నిర్ధయగా దోచుకున్నది.

సోషల్ మీడియా వారియర్లు గొప్పగా పనిచేస్తున్నారు..

ఎన్నికల్లో ఓటమి తర్వాత సామాజిక మాధ్యమాల్లో పార్టీ మద్దతుదారులు ప్రపంచవ్యాప్తంగా బాగా యాక్టివ్‌గా మారారు. ఈ అంశంలో పార్టీని మరింతగా బలోపేతం చేసేందుకు అనేక అంశాలను చర్చించాం. పార్టీ తరఫున ఏం ఆశించకుండానే అద్భుతంగా పనిచేస్తున్నారని, వారి మద్దతును పార్టీకీ సోషల్ మీడియా వారియర్లు అందిస్తున్నారు. ఇంత బలమైన సోషల్ మీడియా బృందాన్ని కలిగినందుకు సంతోషంగా ఉంది.

## గ్యారంటీలతో రాష్ట్రం దివాలానే..



ముంబై:కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కీలక ప్రకటన చేశారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఆరు, ఏడు అంటూ ఎలాంటి గ్యారంటీలూ ప్రకటించడం లేదని స్పష్టం చేశారు. బడ్జెట్ ఆధారంగా హామీలు ప్రకటించాలని.. లేదంటే రాష్ట్రం దివాలా పరిస్థితికి చేరుతుందని వ్యాఖ్యానించారు.విలేకరులతో ఖర్గే మాట్లాడుతూ.. 'త్వరలో జరగబోయే మహారాష్ట్ర ఎన్నికల్లో 5, 6, 10, 20 ఇలా ఏ ఒక్క హామీలను ప్రకటించడం లేదు. బడ్జెట్ ఆధారంగా హామీలు ప్రకటించాలి. లేదంటే రాష్ట్రం దివాలా పరిస్థితికి చేరుతుంది. ప్రణాళికా రహిత విధానం ఆర్థిక ఇబ్బందులకు దారి తీస్తుంది. ఇచ్చిన హామీలు నెరవేర్చకపోతే.. భవిష్యత్తు తరాలపై ప్రతికూల ప్రభావం పడుతుంది. రోడ్లు వేసేందుకు కూడా డబ్బు లేకపోతే.. ప్రభుత్వంపై ప్రజలు తిరగబడతారు. ప్రభుత్వం విఫలమైతే భవిష్యత్తు తరానికి చెడ్డపేరు తప్ప మరొకటి మిగలదు' అంటూ ఎన్నికల హామీలపై ఖర్గే వ్యాఖ్యానించారు.ఎన్నికల సమయంలో ప్రజలు ఆకట్టుకునేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రజలకు పలు హామీలను ఇస్తున్న విషయం తెలిసిందే. కర్ణాటకలో ఐదు గ్యాంరటీలతో, తెలంగాణలో ఆరు గ్యారంటీలతో అధికారంలోకి వచ్చింది. అయితే, గ్యారెంటీల పేరుతో ఆకర్షించి ఓట్లు వేయించుకున్న ఆ పార్టీ ఇప్పుడు ఉచిత పథకాలను అమలు చేయలేక చేతులెత్తేస్తున్నది. కర్ణాటకలో అధికారంలోకి వచ్చిన నెల రోజులకే ఆడంబరంగా ప్రారంభించిన ఉచిత బస్సు పథకానికి ఏడాదిన్నరకే మంగళం పాడేందుకు సిద్ధమైంది. ఈ పథకాన్ని నిలిపేసేందుకు ఇప్పటికే కసరత్తు మొదలు పెట్టినట్లు సమాచారం. తెలంగాణలో సైతం ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో హస్తం పార్టీ విఫలమవుతోందని విపక్షాలు తీవ్ర విమర్శలు చేస్తున్నాయి. ఈ పరిణామాల దృష్ట్యా రాబోయే మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఈ హామీలపై కాంగ్రెస్ పార్టీ వెనకడుగు వేస్తున్నట్లు తెలుస్తోంది.

## ప్రధాని మంత్రి ఆర్థిక మండలి చైర్మన్ బిబేక్ దెబ్రాయ్ మృతి



న్యూఢిల్లీ,నవంబర్ 1: ప్రముఖ ఆర్థికవేత్త, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆర్థిక సలహా మండలి చైర్మన్ బిబేక్ దెబ్రాయ్ కన్నుమూశారు. ప్రస్తుతం ఆయన వయసు 69. అనారోగ్యంతో చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం 7 గంటలకు ఆయన మరణించినట్లు ఢిల్లీ ఎయిమ్స్ తెలిపింది. దెబ్రాయ్ మరణం పట్ల ప్రధాని మోదీ సంతాపం వ్యక్తం చేశారు. దెబ్రాయ్.. ఆర్థిక, చరిత్ర, సంస్కృతి, రాజీకాయలు, ఆధ్యాత్మికత వంటి విభిన్న రంగాల్లో ప్రావీణ్యం కలిగిన వ్యక్తి అని కొనియాడారు. భారత ఆర్థిక విధానాల రూపకల్పనలో ఆయన చెరగని ముద్ర వేశారన్నారు. అంతేకాకుండా ప్రజా విధానానికి ఆయన చేసిన కృషి ఎనలేనిదని కొనియాడారు. పద్మశ్రీ గ్రహీత అయిన దెబ్రాయ్.. భారత ఆర్థిక విధానాలను రూపొందించడంలో ప్రధాన పాత్ర పోషించారు. దెబ్రాయ్ అనేక పుస్తకాలు, పత్రాలు, ప్రముఖ కథనాలను రచించారు. పలు వార్తాపత్రికల్లో బహుళ సంపాదకులుగానూ పనిచేశారు. మహాభారతం, భగవద్గీత, హరివంశం, వేదాలు, వాల్మీకి రామాయణం సహా శాస్త్రీయ సంస్కృతి గ్రంథాలను సంక్షిప్త రూపంలో ఆంగ్లంలోకి అనువదించారు. ఆయన కలకత్తాలోని ప్రెసిడెన్సీ కాలేజీ, పూణెలోని గోఖలే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పాలిటిక్స్ అండ్ ఎకనామిక్స్‌కి ఛాన్సలర్‌గా పనిచేశారు. నవంబర్ 2004 నుంచి డిసెంబర్ 2009 వరకు నేషనల్ మ్యానుఫ్యాక్చరింగ్ కాంపిటీటివ్ కౌన్సిల్‌లో సభ్యుడిగా ఉన్నారు. రాష్ట్ర అభివృద్ధి ప్రణాళికను సిఫార్సు చేసేందుకు జార?ండ్ ముఖ్యమంత్రి ఏర్పాటు చేసిన కమిటీకి ఆయన ఛైర్మన్‌గానూ వ్యవహరించారు. అతను రాజస్థాన్‌లో ముఖ్యమంత్రి ఆర్థిక సలహా మండలి సభ్యుడు కూడా. 2014 నుంచి 2015 వరకూ భారతీయ రైల్వేలను పునర్నిర్మించడానికి రైల్వే మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసిన హైపవర్డ్ కమిటీకి ఛైర్మన్‌గా వ్యవహరించారు. 5 జనవరి 2015న ఆయన నీతీ ఆయోగ్‌లో శాశ్వత సభ్యునిగా నియమితుడయ్యారు. సెప్టెంబర్ 2017లో దెబ్రాయ్.. ప్రధానమంత్రికి ఆర్థిక సలహా మండలి ఛైర్మన్‌గా నియమితులయ్యారు.

## మందు విక్రయాలలో తెలంగాణ నెంబర్ వన్

హైదరాబాద్ : మద్యం విక్రయాల్లో తెలంగాణ రాష్ట్రం అగ్రస్థానంలో నిలిచింది. దేశ వ్యాప్తంగా తీసిన మద్యం విక్రయాల గణాంకాల్లో తెలంగాణ మొదటి స్థానంలో ఉండగా, ఏపీ రెండో స్థానంలో ఉంది. ఢిల్లీలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఫైనాన్స్ పాలసీ (ఎన్ఐపీఎఫ్‌పీ) ప్రకారం తెలంగాణలో గతేడాది సగటు వ్యక్తి మద్యం కోసం రూ.1,623 ఖర్చు చేయగా, ఏపీలో రూ.1,306 ఖర్చు చేశారు. పంజాబ్‌లో రూ.1,245, ఛత్తీస్‌గఢ్‌లో రూ.1,227 ఒక్కో వ్యక్తి ఖర్చుచేస్తున్నట్లు పేర్కొంది.

ఈ రాష్ట్రాలలో తాగుడు ఖర్చు తక్కువే..

ఇక మరోవైపు పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, త్రిపుర మరియు మధ్యప్రదేశ్ రాష్ట్రాలు మద్యంపై తక్కువ ఖర్చు చేస్తున్నాయని అంచనా. ఇది ఇలా ఉంటే తెలంగాణలో 2,620 మద్యం దుకాణాలు, వెయ్యికి పైగా బార్లు, పబ్బులు ఉన్నాయి. దసరా సందర్భంగా దాదాపు రూ.1,000 కోట్ల మద్యం విక్రయాలు జరిగిన విషయం తెలిసిందే. 11 లక్షల కేసుల మద్యం, 18 లక్షల కేసుల బీర్లు విక్రయించారు.

బీర్ల అమ్మకాలలోనూ తెలంగాణకే పట్టం ..



ఇక తెలంగాణ రాష్ట్రంలోనే అత్యధికంగా బీరు కొనుగోలు చేస్తున్నట్లు ఓ సర్వేలో తేలింది. ఏప్రిల్ నుంచి అక్టోబర్ మధ్య కాలంలో బీర్ల కోసం రూ.302.84 లక్షలు ఖర్చు చేసినట్లు అంచనా. నెలకు సరాసరి 16 లక్షల కేసుల బీర్లను తెలంగాణ వాసులు తాగుతున్నట్లు తాజా లెక్కలు వెల్లడిస్తున్నాయి..

## నాగార్జునసాగర్‌లో స్టార్ హెూటల్ నిర్మిస్తాం



హైదరాబాద్ : నాగార్జునసాగర్(నాగార్జునసాగర్), బుద్ధవనం పరిసర ప్రాంతాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంలో స్టార్ హెూటల్ నిర్మాణంతో పాటు, వాటర్ స్పోర్ట్స్ అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు(జూపల్లి కృష్ణారావు) తెలిపారు. శుక్రవారం అయన నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ వద్ద ఉన్న బుద్ధవనం పరిసర ప్రాంతాలను శ్రీ రామచంద్ర మిషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కమలేష్ డి.పాటిల్ (దాజి)తో కలిసి పరిశీలించారు. ముందుగా విజయ విహార్‌లో బుద్ధవనం లే-అవుట్, విజయ విహార్ లేఔట్లను పరిశీలించారు.మొత్తం 270 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించి ఉన్న బుధవనంలో ఉన్న విశేషాలను రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ ఎండీ ప్రకాష్ రెడ్డి, బుద్ధవనం కన్సల్టెంట్ శివనాగిరెడ్డి మంత్రికి వివరించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..నాగార్జునసాగర్, బుద్ధవనానికి ఆసియా ఖండంలోని పలు దేశాల నుంచి బౌద్ధులు ఇక్కడికి వస్తారన్నారు. ప్రత్యేకించి శ్రీలంక, ఇతర ఆసియా ఖండాల నుంచి ఎక్కువ మంది ఉంటారని, వారికి అవసరమైన సౌకర్యాలు, వసతులు కల్పించాల్సి ఉందని తెలిపారు. నిర్మాణాలు చేపడుతామన్నారు. అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూములపై సర్వే నిర్వహించి వివరాలను సమర్పించాలని ఈ సందర్భంగా మంత్రి మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్‌ను స్వాధీనం చేసుకున్నారు.

## దావత్ చేస్కుంటే.. సర్కారుకు చెప్పాలే!

హైదరాబాద్: దీపావళి పండుగ సందర్భంగా బంధుమిత్రులు, స్నేహితులతో కలిసి దావత్ చేసుకోవాలనుకుంటే మందు తాగాలనుకుంటే ఈ జాగ్రత్తలు కచ్చితంగా పాటించాలని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. దీనికి ట్విట్టర్ వేదికగా కొన్ని సూచనలు కూడా చేశారు. ఇటీవల మోకిలలో జరిగిన (జన్వాడ ఫాంహౌస్ కేసు నేపథ్యంలో) ఘటన నేపథ్యంలో ఈ సూచనలు చేయడం గమనార్హం.. అయితే.. ఇది సెటైర్ కాదని, తన నుంచి సీరియస్ సూచన అని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా చేసిన ట్వీట్ అందరిలో ఆలోచన రేకెత్తిస్తోంది. కాగా, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ చేసిన ఈ ట్వీట్‌ను కేటీఆర్ రీట్వీట్ చేసి 'గుడ్ అడ్వైజ్ అన్నా' అని రాసుకొచ్చారు. "తెలంగాణ ప్రజలందరికీ దీపావళి శుభాకాంక్షలు. మీరందరు మీ కుటుంబాలతో హాయిగా గడపాలని కోరుకుంటున్నాను. అయితే గతవారంలో మోకిలలో ఊహించని వేగంతో జరిగిన కొన్ని సంఘటనల దృష్ట్యా, పండుగల సందర్భంగా ప్రజలు కింది జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోమని చెప్పడం నా బాధ్యత గా భావిస్తున్నా" అని ఆర్? ప్రవీణ్ కుమార్ రాసుకొచ్చారు.



ఆర్ఎస్ ప్రవీణ్ చేసిన సూచనలివే..

- మీ బంధుమిత్రులతో విందు భోజనం (దావత్) చేసే ప్లాను ఉంటే ఇంటి ముందు బ్రీత్ అనలైజర్లను, డ్రగ్ టూల్ కిట్లను దగ్గర ఉంచుకుంటే మంచిది. నీళ్లు బాగా తాగండి. యూరిన్ శాంపిల్స్ అవసరం పడవచ్చు.
- మీ మ్యారేజ్ సర్టిఫికెట్, వచ్చే దోస్తుల కుటుంబాల మ్యారేజ్ సర్టిఫికెట్, పిల్లల బర్త్ సర్టిఫికేట్లు పదిలంగా ఉన్నయో లేదో చూసుకోమని చెప్పండి. లేకపోతే కుటుంబాలను పురుషులు-మహిళలు అనే ప్రమాదముంది.
- తాగమని సలహా ఇవ్వను కాని, తాగాలనుకుంటే తప్పకుండా మీ మందు సీసాలకు బిల్లులు ఉండేట్టుగా చూసుకోండి. ఎక్సైజ్ చట్టం ప్రకారం ప్రతి వ్యక్తి దగ్గర డ్యూటీ ఫ్రీ మద్యం రెండు లీటర్లు ఉండవచ్చు. IMFL అయితే 4.5 లీటర్లు ఉండవచ్చు. నో డ్రంక్ అండ్ డ్రైవ్ ప్లీజ్..
- ప్రతి మందు పార్టీకి పర్మిషన్ ఉండాలని మంత్రులు అంటున్నారు. కాబట్టి, స్థానిక పోలీస్ స్టేషన్? నుంచి పర్మిషన్? తీసుకోవాలి.. ఎక్సైజ్ పోలీసులకు ముందస్తు సమాచారం ఇవ్వండి.
- మీరంటే గిట్టని వాళ్లు పోలీసులకు సమాచారం ఇచ్చి కుటుంబ సభ్యులు సరదాగా గడుపుతుంటే దాన్ని 'రేవ్' పార్టీ అనే ప్రమాదం ఉంది. పోలీసులు ఎక్సైజ్ అధికారులు, స్నిఫర్ డాగ్, ఎస్‌వోటీలు 'ఒక గంటలోనే' మీ ఇంటికి వచ్చే అవకాశం ఉంది. అప్రమత్తంగా ఉండండి.
- ఇంట్లో, ఇంటి చుట్టూ సీసీటీవీ కెమెరాలు పని చేస్తున్నాయో లేదో సరిచూసుకోండి. మీ టవర్ లొకేషన్స్ మీరే తెలుసుకోండి. లేదంటే కేంద్ర హెూంశాఖ సహాయమంత్రి ఊరుకోరు.
- ఇన్ని జాగ్రత్తలు తీసుకున్నా కొన్ని 'బిగ్'యూట్యూబ్, మీడియా చానల్స్ పండుగ భోజనాన్ని రేవ్ పార్టీ అని, మీ కుటుంబ సభ్యుల ఫొటోలతో తప్పుడు శీర్షికలతో వైరల్ చేసే ప్రమాదం ఉంది. వాళ్ల మీద పరువునష్టం దావాకు పైసలు రెడీగా పెట్టుకోండి. వాళ్ల మీద యూట్యూబ్‌కు రిపోర్ట్ కొట్టడం నేర్చుకోండి.
- మీకు ఇంకా ఏమైనా డౌట్స్ ఉంటే మీ స్థానిక అధికార పార్టీ నాయకులను అడగండి. వాళ్ల దగ్గర చాలా విలువైన సమాచారం ఉంటుంది.
-టపాకాయలు కాల్చేటప్పుడు చిన్న పిల్లల మీద దృష్టి పెట్టండి. వాళ్లకే చాలా గాయాలు అవుతుంటాయని కూడా క్రాకర్స్ విషయంలో జాగ్రత్తలు చెప్పారు.

### హరి రామజోగయ్య మరో లేఖాస్త్రం

అమరావతి,గోదావరి జిల్లాల అభివృద్ధి పట్టదా అంటూ మాజీ ఎంపీ, రాజకీయ విశ్లేషకుడు చేగొండి హరి రామజోగయ్య మరో లేఖాస్త్రం సంధించారు. ఈ సారి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఉద్దేశించి లేఖ రాశారు. గోదావరి జిల్లాలో అభివృద్ధిపై అందులో ప్రస్తావించారు. అలాగే నరసాపురం - కోటిపల్లి రైల్వే లైన్, కోనసీమలో పెట్రోలియం అనుసంధాన పరిశ్రమలు, వంతెన నిర్మాణాలు, రాజమండ్రి ఎయిర్‌పోర్టుకు అంతర్జాతీయ హెూదా ఇలా పలు అంశాలను ప్రస్తావని మాజీ ఎంపీ లేఖ రాశారు. అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై పలు విమర్శలు గుప్పించారు. గోదావరి జిల్లాల అభివృద్ధి పట్ల గత వైసీపీ ప్రభుత్వంలానే నేటి ఎన్డీఏ ప్రభుత్వం కూడా అలక్ష్యం వహిస్తోందని హరిరామ జోగయ్య మండిపడ్డారు. పలు అంశాలలో గోదావరి పరివాహ ప్రాంతంలో అభివృద్ధి చేపట్టవచ్చునంటూ మాజీ ఎంపీ సూచించారు. ఉభయగోదావరి జిల్లాలలో టెంపుల్ టూరిజం, పర్యాటక రంగం అభివృద్ధి


## సంపాదకీయం

**శనివారం 02-11-2024**

# సైన్సు, విద్యుత్తు -లెనిన్

ఈ సంవత్సరానికి లెనిన్ అమరుడై నూరేళ్లు అవుతున్నది. లెనిన్ను స్మరించుకోవడం అంటే సోవియట్ యూనియన్ గురించి, బోల్షివిక్ విప్లవం గురించి, ఒక కొత్త సామాజిక క్రమం గురించి, వలస పాలనల విముక్తి గురించి, శ్రామికులకు ఉత్పత్తి సాధనాల మీద ఆధిపత్యం గురించి మాట్లాడుకోవడం. అయితే ఇప్పుడు ఆ విషయాలు ప్రస్తావించడం లేదు. లెనిన్ చేసిన కృషిలో చాలా మందికి అంతగా తెలియని రెండు విభిన్న అంశాలున్నాయి. అవి 1. విద్యుత్ రంగం, దాని సామాజిక పాత్ర 2. సైన్స్ తాత్వికత. ఈ రెండు విషయాలలో లెనిన్ సొంత అభిప్రాయాలను కలిగి ఉండటమే కాదు, నాటి తరాల అభిప్రాయాలను మలచడంలో కీలక పాత్ర వహించాడు. ఇప్పటికీ, లెనిన్ అభిప్రాయాలకు ఒక ప్రాసంగికత ఉంది. సోవియట్ యూనియన్‌లో జరగాల్సిన పారిశ్రామిక అభివృద్ధిని, వ్యవసాయక అభివృద్ధినీ ఆయన విద్యుత్‌తో ముడిపెట్టి చూశాడు. సోవియట్లూ, విద్యుదీకరణా జత కలిస్తే, అది సోషలిజమే అని ఆయన ప్రకటించాడు. ఇదొక నినాదం కాదు. ఆర్థిక వ్యవస్థకు, ఉత్పత్తి శక్తులకు, విజ్ఞాన శాస్త్రానికి మధ్య ఉండే ఒక లోతైన సంబంధంగా ఆయన దీన్ని చూశాడు. శాస్త్ర సాంకేతికాలకు, ప్రజా సంఘాలకు (సోవియట్లు) మధ్య సంబంధంగా కూడా చూశాడు. ఇది మొదటిది. ఇక రెండవది క్వాంటం, సాపేక్షతా సిద్ధాంతాలు. అప్పుడప్పుడే ముందుకు వచ్చిన నూతన భౌతిక శాస్త్ర సిద్ధాంతాలు ఇవి. అప్పటి సాంప్రదాయక భౌతిక శాస్త్రానికే కాక, తత్వ శాస్త్రాలకు కూడా ఇవి సవాలు విసిరాయి. దీంతో అప్పటి తత్వవేత్తలలో చీలికలు వచ్చాయి. చాలామంది మార్క్సిస్టులు కూడా సాపేక్ష సిద్ధాంతాలను, క్వాంటం యాంత్రిక శాస్త్రాన్ని బూర్జువా పెడ ధోరణిగా చూశారు. అయితే లెనిన్ గతితార్కిక భౌతిక వాద చట్రం లోకి వీటిని ఏ విధంగా తేవాలి అనేది ఆలోచించడమే కాక, అసలు ఈ చట్రాన్ని కూడా ఏ విధంగా విస్తరించవచ్చో ఆలోచించాడు. 'భౌతిక వాదము-అనుభవవాద విమర్శ' అనే ప్రఖ్యాత పుస్తకంలో కానీ, సొంత నోట్స్‌గా రాసుకున్న 'ఫిలసాఫికల్ నోట్‌బుక్'లో గాని ఇవి కనిపిస్తాయి. కానీ లెనిన్ 53 ఏళ్ళ వయసుకే చనిపోవడంతో, ఆ ఆలోచనలు అసంపూర్ణంగా ఆగిపోయాయి. ఇప్పుడు విద్యుదీకరణ కథ గురించి రేఖామాత్రంగా పరిశీలిద్దాం. 1918లో బోల్షివిక్ విప్లవం జరిగినప్పుడు, రష్యాలో ఉత్పత్తి అయిన విద్యుత్ శక్తి 4.5 మెగావాట్లే. అది మహా అంటే కొన్ని నగరాలకు సరిపోయేది. అయితే, విద్యుదీకరణ జరగకుండా పరిశ్రమలు గానీ, వ్యవసాయం కానీ ముందుకు పోలేవు. నీటిపారుదల వ్యవస్థలు ముందుకు పోవాలన్నా, వ్యవసాయానికి పనిముట్లు తయారు కావాలన్నా విద్యుత్ శక్తి ఉండాల్సిందే. వీటన్నింటికీ అవసరమైన యంత్రాలను దిగుమతి చేసుకోవడం కాదు, వాటిని ఉత్పత్తి చేసుకోవాలి. అందుకే సోవియట్ల శక్తికి తోడుగా విద్యుదీకరణ జరిగితేనే సోషలిజమైనా, కమ్యూనిజమైనా అని లెనిన్ భావించాడు. పారిశ్రామికీకరణ మొదట జరగాల్సింది విద్యుత్ రంగంలోనే. శాస్త్రవేత్తలు, ఇంజనీర్లు ముందుకు తెచ్చిన దేశవ్యాప్త విద్యుదీకరణ పథకాలకు కమ్యూనిస్టు పార్టీ ఆమోద ముద్ర వేసింది. కొమిన్‌టన్ మూడో కాంగ్రెస్ (జులై 19-21)లో బోల్షివిక్ విప్లవానికి, దేశ విద్యుదీకరణ ఎంతో ముఖ్యం అన్న అవగాహనను లెనిన్ పునరుద్ఘాటించాడు. అలాగే, వ్యవసాయాన్ని పునర్వ్యవస్థీకరించగలిగిన ఒక విస్తృతమైన యంత్ర పరిశ్రమ ఉండాలని, సోషలిజానికి అవసరమైన ఒక భౌతిక ప్రాతిపదికను అది సమకూరుస్తుందని ఆయన భావించాడు. రష్యాలో ఉన్న, 200 మంది ఉద్దండ శాస్త్రవేత్తలు, ఇంజనీర్లు వ్యవసాయ శాస్త్రవేత్తల వైజ్ఞానిక కృషితో విద్యుదీకరణ ప్రణాళికకు పూనుకున్నాడు. ఇందుకోసం 1921లో 'ఆల్ రష్యా ఇంజనీర్స్ కాంగ్రెస్'ను నిర్వహించాడు. అందులో ఈ ప్రణాళిక సంపూర్ణంగా చర్చించబడిన తర్వాతే, ప్రభుత్వ ఆమోదానికి వెళ్ళింది. కానీ, బూర్జువా పండితులు, ఆధునికానంతర వాదులు (పోస్ట్ మార్క్సిస్టులు), లెనిన్ను ఒక యాంత్రిక భౌతికవాదిగా చిత్రించే ప్రయత్నం చేశారు. సైన్సును సాంకేతిక వినియోగాలకే లెనిన్ కుదిస్తున్నట్టుగా చెప్పుకొచ్చారు. కానీ సాంకేతిక పనివారికి, రైతులకు మధ్య ఒక గట్టి సంబంధాన్ని లెనిన్ స్థిరపరిచాడు. రష్యా సత్వర పారిశ్రామికీకరణకు, వ్యవసాయ విస్తరణకూ సైన్సును ఒక కీలక అంశంగా లెనిన్ వాడాడు. విప్లవ శక్తులు, శాస్త్రవేత్తలు, ఇంజనీర్లు కలసిమెలసి పని చేసిన సందర్భం అది. విద్యుదీకరణ కోసం హైడ్రో టర్బైన్‌లను ఉత్పత్తి చేయాలి. అంటే, అది పారిశ్రామిక శక్తిని సంతరించుకోవడం కూడా. ప్రజలకు విద్యుత్తును అందించడమే కాదు. డ్యాములు వ్యవసాయానికి అవసరమైన నీళ్లనూ ఇస్తాయి. అంటే ఈ జల విద్యుత్ ప్రాజెక్టుల చుట్టూ కార్మికుల, రైతుల ఐక్యత నిర్మింపబడుతుంది. పెద్ద పారిశ్రామిక పురోగమనానికి పునాదిగా విద్యుదీకరణ ఉపయోగపడింది. వర్కర్ల, సాంకేతిక నిపుణుల కేడర్‌ను ఇది సృష్టించింది. సోవియట్లు, విద్యుత్తు అనే రెండు మాటలు లెనిన్ రాజకీయ నినాదాలుగా వాడాడు. అవి ఆయనకు సాంకేతిక, ఆర్థిక అంశాలు మాత్రమే కాదు. స్వాతంత్ర్యానంతర భారత దేశంలో కూడా దీనికి ఒక పోలిక కనిపిస్తుంది. విద్యుత్ రంగంలో నెహ్రూ ఆలోచనలు, సోషలిస్టుల, కమ్యూనిస్టుల ఆలోచనలు, అలాగే అంబేద్కర్ దార్శనికత కలవడం చూస్తాం. నెహ్రూ, అంబేద్కర్‌లు విద్యుత్ రంగాన్ని, హైడ్రో ఎలక్ట్రికల్ ప్రాజెక్టులను దేశాభివృద్ధికి కీలకమైనవిగా చూశారు. బృహత్తర ప్రాజెక్టులకు ప్రత్యామ్నాయంగా అనేక చిన్న చిన్న ప్రాజెక్టులు, చిన్న చిన్న పరిశ్రమలు కూడా ఉండాలని తర్వాత నెహ్రూ భావించాడు. కానీ పెద్ద ప్రాజెక్టులను ఆధునిక దేవాలయాలన్నాడు. 1948 లోనే అంబేద్కర్ భారత విద్యుత్ చట్టానికి రూపకల్పన చేశాడని చాలామందికి తెలియదు. విద్యుత్ అందరికీ తప్పనిసరి అవసరమని, అది ప్రభుత్వ రంగంలోనే ఉండాలని, అందులో లాభాపేక్ష తగదని ఆయన భావించాడు. అంబేద్కర్ తనను తాను సోషలిస్టుగా (మార్క్సిస్టుగా కాకున్నా) అభివర్ణించుకున్న విషయం గమనార్హం. లెనిన్ రాజకీయ కార్యాచరణలకు, విప్లవ పార్టీ నిర్మాణానికి చేసిన బహుముఖ కృషి ఒక ఎత్తు అయితే, తత్వ శాస్త్రానికి, విజ్ఞాన శాస్త్ర తాత్వికతలకు చేసిన కృషి మరొక ఎత్తు. భౌతిక వాదం అనుభవవాద విమర్శ అనే ప్రఖ్యాత గ్రంథంలో క్వాంటం మెకానిక్స్‌ను, ఏటువంటి విమర్శ లేకుండా స్వీకరించిన కోపెన్‌హెగెన్ వ్యాఖ్యానాన్ని ఆయన విమర్శించాడు. క్వాంటం, సాపేక్ష సిద్ధాంతాలు అన్ని తత్వశాస్త్ర సిద్ధాంతాలకు గట్టి సవాళ్లను విసిరాయి. నిజానికి, విజ్ఞాన శాస్త్రంలో ఏ కీలకమైన ముందడుగు పడినా జరిగేది ఇదే. అప్పటి వరకు ప్రకృతి గురించి మనకున్న విజ్ఞానాన్ని మాత్రమే కాదు, ఆ విజ్ఞానం ఆధారంగా తయారైన తత్వ శాస్త్రాలను కూడా ఈ నూతన విజ్ఞానం సవాలు చేస్తుంది. ఒకప్పటి సూర్యకేంద్రక సిద్ధాంతం లాగే క్వాంటం సాపేక్ష సిద్ధాంతాలు తాత్విక ప్రపంచాలను ఒక కుదుపు కుదిపాయి. కాలానికి ఉన్న తాత్విక స్వభావాన్ని, ఐన్‌స్టిన్ అర్థం చేసుకోలేక పోయాడంటూ, ఆయన సాపేక్ష సిద్ధాంతాన్ని తిరస్కరించ చూశారు. కాలాన్ని కొలవటానికి వీలైనదిగా, వస్తుగతమైనదిగా ఐన్‌స్టిన్ భావించాడు. దాని మార్మికతల గురించి హెన్రీ బెర్గ్‌సన్ లాంటి శాస్త్రవేత్తలు చెప్పారు. ఈ ప్రభావం నోబెల్ కమిటీ మీద కూడా పడింది.

# సరస్వతీ పవర్ పేరుతో మోసం చేశారు

సెంట్రల్ డెస్క్: సరస్వతి పవర్ అండ్ ఇండస్ట్రీస్ కోసం రైతుల నుంచి సేకరించిన భూముల వ్యవహారం ఇప్పుడు హాట్ టాపిక్?గా మారింది. 15 ఏళ్ల కిందట తమ నుంచి కొనుగోలు చేసిన భూముల్లో విద్యుత్?, సిమెంటు పరిశ్రమలను ఏర్పాటు చేస్తామని చెప్పారని, అదేవిధంగా తమకు ఉపాధి కల్పిస్తామని హామీ ఇచ్చారని 'సరస్వతి పవర్ ' కోసం భూములు ఇచ్చిన పల్నాడు జిల్లా మాచవరం మండలం చెన్నాయపాలెం గ్రామానికి చెందిన రైతులు చెబుతున్నారు. కానీ, ఇప్పటి వరకు పరిశ్రమ ఏర్పాటు చేయకపోగా, తమకు ఉపాధి కూడా కల్పించలేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**భూములిస్తారా?. పరిహారం పెంచుతారా?**

తమ భూములు తమకు ఇచ్చేయాలని చెన్నాయపాలెం రైతులు పట్టుబడుతున్నారు. లేకపోతే.. ప్రస్తుత ధర ప్రకారం ఎకరానికి ?18 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. పరిశ్రమను ఏర్పాటు చేయాలన్న ఉద్దేశం ఉంటే తక్షణమే పరిశ్రమ ఏర్పాటు చేసి తమకు ఉపాధి కల్పించాలని కోరుతున్నారు. "మీ గ్రామాన్ని అన్ని విధాలా ఆదుకుంటాం. మౌలిక వసతులు కల్పిస్తాం. అర్హతలు ఉన్న వారికి పరిశ్రమలో ఉద్యోగావకాశాలు కల్పిస్తాం. భూములు ఇచ్చిన రైతుల కుటుంబాలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తాం". అని అప్పట్లో అనేక హామీలు ఇచ్చారు. 15 ఏళ్ల కిందట అతి తక్కువ ధరకే మా నుంచి భూములు కొనుగోలు చేశారు. కానీ, ఇప్పటికీ పరిశ్రమ ఏర్పాటు చేయలేదు" అని చెన్నాయపాలెం రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు ఈ నేపథ్యంలో తమ భూములు తిరిగి తమకు అప్పగించాలని కోరుతున్నారు. భూములు కొని సుమారు 15 ఏళ్లు అవుతున్నా ఇప్పటికీ ఎలాంటి నిర్మాణాలు చేయలేదన్నారు. కానీ, అప్పట్లో రెండు మూడేళ్లలోనే నిర్మాణం చేపడతామని నమ్మబలికారని తెలిపారు.

**భవిష్యత్తుపై ఆశతో కారు చౌకగా..**

పరిశ్రమను నిర్మిస్తే తమ పిల్లలకు ఉద్యోగావకాశాలు వస్తాయని, తమకు ఉపాధి దొరుకుతుందని, గ్రామం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందని ఆశపడి తక్కువ ధరకే అప్పట్లో రైతులు భూములు ఇచ్చారు. దాచేపల్లి, మాచవరం మండలాల్లో 1,515 ఎకరాల రైతుల భూముల్ని కారుచౌకగా కొనేశారు. మాచవరం మండలంలో1077.38 పట్టా భూములను ఫ్యాక్టరీ యాజమాన్యం గతంలో కొనుగోలు చేసింది. మాచవరం మండలంలోని చెన్నాయపాలెం గ్రామంలో 272.96 ఎకరాల భూమి, పిన్నెల్లి గ్రామంలో 93.79 ఎకరాలు, వేమవరం గ్రామంలో 710.63 ఎకరాలు భూమిని కొనుగోలు చేశారు. మొత్తం మాచవరం మండలంలో 1073.38 ఎకరాలు గ్రామ ప్రజలు నుంచి సరస్వతి పవర్ యాజమాన్యానికి విక్రయించారు. ఈ భూముల్లో చెరువు భూములు గాని, అటవీ భూములు కానీ లేవు. ఈ భూమిలో 821.44 ఎకరాలు పోర్టెడ్ (సురక్షిత ప్రాంతంగా ప్రకటించారు) చేశారు. మిగిలిన 255.94 ఎకరాలు పోర్టెడ్ చేయాలి. పిన్నెల్లి గ్రామంలో 2.87 ఎకరాలు, వేమవరం గ్రామంలో 1.44 ఎకరాలు, మొత్తం కలిపి 4.31 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని ఇటీవల సర్వే జరిపిన అధికారులు తెలిపారు. ఇక దాచేపల్లి మండలంలో ప్రభుత్వ భూములనూ సరస్వతీ పవర్ సంస్థ తమ ఆధీనంలో తీసుకున్నట్టు ప్రచారం జరుగుతోంది.

**కంపెనీ కట్టలేదు.. కర్షకుల భూమీ లేదు**

పరిశ్రమ నిర్మాణం గురించి అడిగితే చూస్తాం, చేస్తాం అని చెప్పటమే కానీ.. నిర్మించింది లేదని స్థానిక రైతులు మండిపడుతున్నారు. పరిశ్రమను నిర్మించే వరకు ఎవరి భూములు వారు సాగు చేసుకుంటామని, నిర్మాణం మొదలు పెట్టగానే ఇచ్చేస్తామని తాము చెప్పినా యాజమాన్యం పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కంపెనీ కట్టలేదు. ఊళ్లో పని లేదు. చేతిలో చిల్లిగవ్వలేదు. ఈ స్థితిలో కొంత మంది రైతులు ఉపాధి అవకాశాలు దొరక్క 'సరస్వతి'కి ఇచ్చిన భూముల్లో పంటలు సాగు చేశారు. ఇది గమనించిన వైసీపీ నాయకుడు, అప్పటి మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన తమ్ముడు వెంకట రామిరెడ్డి ఆధ్వర్యంలో కడప గూండాలు సుమారు ఐదు వందల మంది ట్రాక్టర్లతో వచ్చి పచ్చని పంట పొలాలను దున్నేసి విధ్వంసం సృష్టించారని బాధిత రైతులు తెలిపారు. అడ్డు వచ్చిన మహిళా రైతులను విచక్షణా రహితంగా కొట్టి గాయ పరిచారని ఆవేదన వ్యక్తం చేశారు.

**ఇక.. ఉద్యమమే..**

ఇది తెలుసుకున్న టీడీపీ నేత, గురజాల ప్రస్తుత ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌ను, జిల్లా అధికారులను పిలిపించి నష్టపోయిన రైతులను గుర్తించారు.

# ఆ ఒక్క తప్పు.. నాగం కొంప ముంచింది

హైదరాబాద్,ఒక్క నిర్ణయం జీవితాన్ని మార్చేస్తుంది. ఎస్ అది నిజమే అ టైంలో అడుగు జాగ్రత్తగా వేయకపోతే ఆకాశం నుండి అధః పాతాళానికి పడిపోతాం.. జీవితంలో మనం ఉన్న స్థాయిని చేజేతులా నాశనం చేసుకొని డైలమాలో పడాల్సి వస్తుంది. సామాన్య డాక్టర్‌గా ప్రాక్టీస్ చేస్తూ పొలిటికల్ ఎంట్రీ ఇచ్చి ఎంతో ఎత్తుకు ఎదిగి.. గౌరవ ప్రదమైన రిటైర్మెంట్ కోరుకున్న ఓ మాజీ మంత్రి వేసిన ఒకే ఒక్క తప్పటడుగు ఆయన జీవితంలో సంపాదించుకున్న పేరు ప్రఖ్యాతులను హరించి వేసింది. ఉన్నత స్థానం నుండి ఒక్క సారిగా కిందికి తోసేసింది. ఇంతకు ఎవరు ఆ నాయకుడు? ఆ లీడర్ అ స్టోరి ఏంటి?

**నాగర్‌కర్నూలులో ఒకప్పుడు చక్రం తిప్పిన నాగం జనార్ధనరెడ్డి**

నాగం జనార్దన్ రెడ్డి తెలుగు రెండు రాష్ట్రాల్లో ఈ పేరు తెలియని వారు ఉండరు. నాగర్ కర్నూల్ నియోజకవర్గం అంటే నాగం.. నాగం అంటే నాగర్ కర్నూల్ అన్న రేంజ్లో రాజకీయాల్లో చక్రం తిప్పారాయన. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలుగు దేశం ప్రభుత్వ హయాంలో తిరుగులేని నేతగా ఎదిగిన ఆయన తన రాజకీయ భవిష్యత్తును తానే నాశనం చేసుకున్నారన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది. హితులు సన్నిహితులు చెప్పిన మాటలు పెడ చెవిన పెట్టి రాజకీయంగా ఆత్మహత్యకు పాల్పడ్డారని అటు రాజకీయవర్గాల్లోనూ, నాగర్‌కర్నూల్ వాసుల్లోనూ చర్చ జరుగుతుంది.

**నాగంకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చిన చంద్రబాబు**

అసెంబ్లీ టైగర్‌గా పేరు ఉన్న నాగం జనార్దన్ రెడ్డి సుదీర్ఘకాలం పాటు నాగర్ కర్నూల్ ఎమ్మెల్యేగా , మంత్రిగా పనిచేశారు . పార్టీలో చంద్రబాబునాయుడు ఆయనకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి ప్రోత్సహించారు. 2009లో గెలిచిన నాగం తెలంగాణ ఉద్యమ సమయంలో ఉస్మానియా క్యాంపస్ లో దాడి తర్వాత సెంటిమెంట్ పేరుతో టిడిపి అధినేతతో విభేదించి పార్టీకి, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసారు. తన రాజీనామా ఆమోదం కోసం అసెంబ్లీలో బైఠాయించిన మొండిఘటం నాగం జనార్దన్ రెడ్డి.

**మహబూబ్‌నగర్ ఎంపీగా బీజేపీ నుంచి పోటీ చేసి ఓటమి**

ఆ తర్వాత తెలంగాణా నగారా అని సొంత పార్టీ స్థాపించి తెలంగాణా రాష్ట్రం కోసం బలిదానాలు వద్దు కొట్లాడి తెచ్చుకుందామంటూ భరోసా యాత్ర నిర్వహించారు. తిరిగి 2011 నాగర్ కర్నూల్ ఉప ఎన్నికల్లో స్వతంత్రుడిగా పోటీ చేసి గెలుపొందారు. ఆ తర్వాత నాగం జనార్దన్ రెడ్డి బిజెపిలో చేరారు. రాష్ట్రం ఏర్పాటు తర్వాత కేసీఆర్‌పై ఒంటరి పోరాటం చేస్తూ.. గులాబీ పార్టీ ప్రభుత్వంలో అక్రమాలు జరుగుతున్నాయని కోర్టులో కేసులు వేశారు. బిజెపిలో కొనసాగుతున్నప్పుడు 2014 ఎన్నికల్లో మహబూబ్ నగర్ ఎంపిగా ఆయనకు, నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఆయన కుమారుడు డాక్టర్ శశిధర్ రెడ్డికి టికెట్టు ఇచ్చారు. అయితే తండ్రి కొడుకులు ఇద్దరు పరాజయం పాలయ్యారు. ఆ ఓటములు ఒకరకంగా ఆయన రాజకీయ జీవితాన్ని అదః పాతాళానికి తొక్కేశాయనే చెప్పాలి. నాగర్ కర్నూల్ నియోజకవర్గంలో అప్పటికే నాగం,కూచకుళ్ల మధ్య పచ్చగడ్డి వేస్తే బగ్గుమనేలా రాజకీయపోరు కొనసాగుతుంది. నియోజకవర్గంలో పట్టు సాధించేందుకు ఒకరిపై ఒకరు రాజకీయ వ్యూహాలు రచించుకున్నారు. అప్పటికే బీఆర్‌ఎస్ పార్టీలో చేరి ఎమ్మెల్యేగా టికెట్ తెచ్చుకున్న మర్రి జనార్దన్ రెడ్డి ఈ అవకాశాన్ని తనకు అనుకూలంగా మార్చుకున్నారు. పిట్ట పోరు పిల్లి తీర్చినట్టు తీర్చినట్టు నాగర్ కర్నూల్ నియోజకవర్గంలో ఇద్దరిని ఓడించి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఎమ్మెల్యేగా గెలిచిన మర్రి జనార్దన్ రెడ్డి నియోజకవర్గంలో తిరుగులేని నాయకుడిగా ఎదిగారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మర్రిని ఎదుర్కొనేందుకు బద్ధ శత్రువులైన నాగం, కూచకుళ్లలు కలిసికట్టుగా వ్యవహరించి మంచి ఫలితాలను సాదించారు. ఆ తర్వాత బిజెపిలో పొసగక రాజీనామా చేసిన నాగం ఎలాగైనా ఒక్కసారి ఎమ్మెల్యేగా గెలుపొంది గౌరవ ప్రదమైన రిటైర్మెంట్ తీసుకుంటానని పలుసార్లు ప్రెస్‌మీట్లలో చెపుతూ వచ్చారు.

**కాంగ్రెస్ టికెట్ ఇచ్చినా గెలవలేకపోయిన నాగం**

2018 అసెంబ్లీ ఎన్నికల వేళ నాగం కాంగ్రెస్ పార్టీ లో చేరి నాగర్ కర్నూల్ అసెంబ్లీ టిక్కెట్టు తెచ్చుకున్నారు . కాని టైం కలిసి రాలేదు. నాగం జనార్దన్ రెడ్డికి కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇవ్వడంతో కూచకుళ్ల కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి బేషరతుగా బిఆర్ఎస్ కు మద్దతు ఇచ్చి నాగంను ఓడించారు. ఓడిన




నాగం కాంగ్రెస్ పార్టీలోనే గడిచిన అసెంబ్లీ ఎన్నికల వరకూ కొనసాగుతూ వచ్చారు. నాగం జనార్దన్ రెడ్డితో విభేదించి బీఆర్‌ఎస్లో చేరిన కూచుకుల్ల దామోదర్ రెడ్డి మహబూబ్ నగర్ ఎమ్మెల్సీగా కొనసాగారు. అయితే బీఆర్‌ఎస్‌లో తనకు సరైన గౌరవం దక్కడం లేదని 2023 ఎన్నికలకు ముందు తన తన కొడుకు రాజేష్ రెడ్డితో కలిసి బయటకు వచ్చారు.

**కాంగ్రెస్ నిర్ణయాన్ని, అనుచరుల ఒత్తిడిని పట్టించుకోని నాగం**

గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుండి తన కొడుకును ఎమ్మెల్యే అభ్యర్థిగా నిలబెట్టేందుకు కూచకుల్ల పావులు కదిపారు. అయితే అప్పటికే పార్టీలో ఉండి టికెట్ కోసం ఆశపడిన నాగం జనార్దన్ రెడ్డి కూచుకుల్లకు వ్యతిరేకంగా పావులు కదిపే ప్రయత్నం చేశారు. అయితే సర్వేల ఫలితాలు నాగం కుమారుడి కన్నా కూచకుళ్ల కుమారుడు రాజేష్ రెడ్డికి అనుకూలంగా రావడంతో కాంగ్రెస్ పార్టీ రాజేష్ రెడ్డికి టికెట్ కేటాయించి నాగం కు షాక్ ఇచ్చింది. ఇది ఇద్దరి మధ్యన గ్యాప్ ను మరింత పెంచినప్పటికీ నియోజకవర్గంలో పాతుకుపోయిన అప్పటి బీఆర్‌ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డిని ఓడించాలంటే నాగం, కూచుకుల్ల ఒకటైతే సాధ్యమని కాంగ్రెస్ పెద్దలు భావించారు. అందులో భాగంగా భవిష్యత్తులో నాగం జనార్దన్ రెడ్డికి గౌరవమైన స్థానం ఇస్తామని .. బరిలో ఉన్న కూచుకుళ్ళ కు సపోర్ట్ చేయాలని అధిష్టానం ఆదేశించింది. అయితే అధిష్టానం నిర్ణయాన్ని నాగం డోంట్ కేర్ అన్నారునాగర్ కర్నూల్ నియోజకవర్గంలో రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిచిన మర్రి జనార్దన్ రెడ్డి ఆ అవకాశాన్ని మరోసారి తనకు అనుకూలంగా మార్చుకునే ప్రయత్నం చేశారు. నాగం,కూచకుళ్ల మధ్య ఉన్న వైరంతో రెండవ సారి ఎమ్మెల్యేగా గెలిచిన మర్రి వారి మధ్య గ్యాప్‌ను వాడకుని మరోసారి ఎమ్మెల్యేగా గెలవాలని చూశారు. అయితే మర్రి జనార్దన్ రెడ్డి ఆశలపై నీళ్లు చల్లుతూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన కూచకుళ్ళ రాజేష్ రెడ్డి ఎమ్మెల్యేగా గెలిచారు.

**సడన్‌గా రూటు మార్చి కేసీఆర్ పక్షాన చేరిన నాగం**

గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ టిక్కెట్టు దక్కక పోయినా నాగం పార్టీలోనే ఉండాలని కాంగ్రెస్ అధిష్టానం సూచించింది. భవిష్యత్తులో గౌరవప్రదమైన పొజిషన్ కల్పిస్తామని హామీ కూడా ఇచ్చింది. ఆ క్రమంలో కూచకుల్ల గెలుపు కోసం కృషి చేయాలని నాగం అనుచరగణం కూడా ఆయనపై వత్తిడి తెచ్చిందంట. అయితే నాగం ఎవరి మాట వినలేదు. దీర్ఘకాలంగా కేసీఆర్‌ను దూషిస్తూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం అక్రమాలపై కోర్టులో కేసులు వేస్తూ వచ్చిన నాగం జనార్దన్ రెడ్డి సడన్‌గా రూట్ మార్చి కేసీఆర్, మర్రిల చెంత చేరడంతో ఆయన క్యాడర్ అయోమయానికి గురి అయింది. దాంతో నాగం అనుచరులు కూచకుళ్ల వైపు చేరిపోయారు.

**గౌరవ ప్రదమైన రిటైర్‌మెంట్ తీసుకోవాలని సూచనలు**

ఇక ఎన్నికల్లో నాగం సపోర్ట్ చేసిన మర్రి జనార్ధనరెడ్డి ఓడిపోవడంతో ఆయన పొలిటికల్ కెరీర్ క్రాస్‌రోడ్స్‌లో పడింది. రాజకీయాలలో గౌరవ ప్రదమైన రిటైర్‌మెంట్ తీసుకుందామనుకున్న నాగం కు నియోజకవర్గంలో కనీస సానుభూతి మిగల కుండా పోయింది. స్వయంకృతాపరాధంతో తన కెరీర్‌ను ఎటూ కాకుండా చేసుకున్న నాగం ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా, బీఆర్‌ఎస్‌క మద్దతుగా వాయిస్ వినిపిస్తున్నారు. డిసెంబర్ 7న పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం లో 3వ స్టేజి వద్ద నిరసన దీక్ష చేపడతానని ప్రకటిచారు. అదే ఆయన అనుచరులకు నచ్చడం లేదంట. బీఆర్‌ఎస్ ట్రాప్ లో పడకుండా గౌరవ ప్రథమైన రిటైర్‌మెంట్ తీసుకోవాలని వారితో పాటు నియోజకవర్గ వాసులు నాగంకు సూచిస్తున్నారు.

# ఎన్ని డబ్బులు పెట్టిన ఇసుక దొరకలేదు

నెల్లూరు, వైసీపీ పాలనలో ఇసుక ధరలు ఆకాశాన్నంటాయని, ఎన్ని డబ్బులు పెట్టిన దొరకని పరిస్థితులు నెలకొన్నాయని ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి అన్నారు. రూరల్ టీడీపీ కార్యాలయంలో బుధవారం జరిగిన 'ఉచిత ఇసుకపై జన ఆనందం' కార్యక్రమంలో ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి పాల్గొన్నారు. ఉచిత ఇసుక విధానంపై భవన నిర్మాణ కార్మికులు, బిల్డర్లు, నిర్మాణదారులు, ట్రాక్టర్ల యజమానులు, ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోటంరెడ్డి మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వంలో ట్రక్కు ఇసుక ధర రూ.5 వేలు నుంచి రూ.6 వేలు ఉండేదని.. అయినా ఇసుక దొరికేది కాదన్నారు. ఇప్పుడు అదే ఇసుక రూ.1000 వస్తోందన్నారు. వైసీపీ హయాంలో సీఎం జగనే ఇసుక వ్యాపారం చేశారని, ఎమ్మెల్యేలకు ప్రశ్నించే అవకాశం ఉండేది కాదని, ఏజెంట్లుని పెట్టుకుని ఇసుక వ్యాపారం నడిపించారని ఆరోపించారు. వైసీపీ హయాంలో ఇసుక ట్రాక్టర్లకు లోడ్ చేసేవాళ్ళు కాదని, టిప్పర్లు లోడ్ చేసేవాళ్ళని ఎమ్మెల్యే కోటంరెడ్డి అన్నారు. ఎందుకంటే ట్రాక్టర్లు పేదోళ్ళవి.. టిప్పర్లు ముఖ్యమంత్రివి.. ఇసుక టిప్పర్లు టచ్ చేస్తే సీఎం కార్యాలయం నుంచి కాల్ చేసే వాళ్లని.. ఎస్పీలు, కలెక్టర్లు ఏజంట్లుగా పని చేశారని అన్నారు. 11 సీట్లు ఇచ్చి జనం ఛీ కొట్టి తిరస్కరించారని.. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వానికి వైసీపీ నేతలు సహకరించాలని సూచించారు. ఇసుక విషయంలో వైసీపీ మాటలు చూసి ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు. జగన్ పాలనలో ఇసుక విషయంపై ఎమ్మెల్యే, ఎంపీలకు మాట్లాడే హక్కు కూడా ఉండేది కాదన్నారు. జగన్ రాష్ట్రాన్ని దివాలా తీయిస్తే, చంద్రబాబు గాడిలో పెడుతున్నారన్నారు. ఇసుక కోళ్లగొట్టి జగన్ ప్రజల నెత్తిన భారం పెట్టారని మండిపడ్డారు. అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఇచ్చిన హామీలను వంద శాతం నెరవేరుస్తున్నారని.. 'ఇసుక అధిక ధరల అంతం.. చంద్రబాబు పంతం'

# టెండర్లను పిలిచిన ఏపీ ప్రభుత్వం

అమరావతి, ఢిల్లీలో ఏపీ నూతన భవన్ నిర్మాణానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సిద్ధమైంది. 'రీ డెవలప్మెంట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ భవన్' పేరుతో రాష్ట్ర ప్రభుత్వం డిజైన్లకు టెండర్లు పిలిచింది. రాష్ట్ర విభజన తర్వాత ఢిల్లీలో ఏపీ భవన్ విభజన జరిగింది. సార్వత్రిక ఎన్నికలకు ముందు రెండు రాష్ట్రాల అధికారులు చర్చించి భవన్ విభజన ఖరారు చేశారు. రెండు రాష్ట్రాల అధికారుల ప్రతిపాదనకు కేంద్ర హోం శాఖ ఆమోదం తెలిపింది. ప్రస్తుతం ఉన్న భవనాలను కలిపి రెండు రాష్ట్రాలు వినియోగించుకుంటున్నాయి. కొత్త భవన్ నిర్మాణం చేపట్టాల్సి రావడంతో ఏపీ ప్రభుత్వం డిజైన్ల ప్రక్రియ మొదలు పెట్టింది. ప్రస్తుతం గోదావరి, స్వర్ణముఖి బ్లాక్, నర్సింగ్ హాస్టల్, పటౌడి హౌస్.. మూడు చోట్ల నిర్మాణానికి డిజైన్లు ఆహ్వానించింది. మూడు ప్రదేశాల్లో కలిపి మొత్తం 11.53 ఎకరాల్లో ఏపీ భవన్ నిర్మాణానికి రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ డిజైన్లు కోరింది. బుధవారం సాయంత్రం లోపు ఆసక్తి ఉన్న గుత్తేదారులు తమ 'ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రస్ట్' ను సంబంధిత వెబ్‌సైట్‌లో అప్లోడ్ చేయాలని నోటిఫికేషన్ ఇచ్చింది. నవంబర్ 28 లోపు తమ ప్రతిపాదనలు సమర్పించాలని రహదారులు, భవనాల శాఖ విజయవాడ సర్కిల్ ఎస్ఈ నోటిఫికేషన్‌లో స్పష్టం చేశారు. కాగా ఢిల్లీ అశోకా రోడ్డుతో పాటు మాధవరావు సింధియా మార్గ్‌లో కలిపి రెండు రాష్ట్రాలకు 19.733 ఎకరాల భూమి ఉంది. ఇందులో తెలంగాణ వాటాగా 8.245 ఎకరాలు, ఏపీ వాటాగా11.536 ఎకరాలు కేటాయిస్తూ కేంద్ర హోంశాఖ నిర్ణయం తీసుకుంది. తెలంగాణకు శబరి బ్లాక్‌లో 3.00 ఎకరాలు, పటౌడి హౌస్‌లో 5.245 ఎకరాలు కేటాయించారు. అలాగే ఏపీకి 5.781 ఎకరాల్లో ఉన్న గోదావరి బ్లాక్, స్వర్ణముఖి బ్లాక్‌ను కేటాయిస్తూ నిర్ణయించారు. అలాగే ఏపీకి నర్సింగ్ హాస్టల్‌లో 3. 359 ఎకరాలు, పటౌడి హౌస్‌లో 2.396 ఎకరాలు కేటాయిస్తూ కేంద్ర హోంశాఖ ఉత్తర్వులిచ్చింది. ఈ ప్రతిపాదనకు రెండు రాష్ట్రాలు అంగీకారం తెలిపాయి. ఢిల్లీలో తెలుగువారికి చిరునామాగా నిలిచే ఏపీ భవన్ ఆస్తుల పంపకం ఎట్టకేలకు పూర్తి అయింది. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన తర్వాత ఆస్తుల పంపకం కొలిక్కి రాకపోవడంతో రెండు తెలుగు రాష్ట్రాలతో కేంద్ర ప్రభుత్వం చర్చలు జరిపింది. తాజాగా ఏపీ భవన్ విభజనపై కేంద్రహోంశాఖ కీలక ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర విభజన సమయంలోనే ఉమ్మడి ఆస్తులను ఏపీ, తెలంగాణకు 52:48 నిష్పత్తిలో పంచారు.

# బంగారం ధరల పరుగులు

ముంబై, దేశంలో బంగారం కొనుగోళ్లు తగ్గుతున్నాయి. ధరల కారణంగా బాగా డబ్బున్న వాళ్లు తప్ప పేద, మధ్యతరగతి ప్రజలకు బంగారం అందుబాటులో ఉండడం లేదు. బాంగారం ఏకంగా 80వేలు దాటడం కలవరపెడుతోంది. పెళ్లిళ్ల సీజన్ ఆరంభం కావడం, ధనత్రయోదశి పండగలు వచ్చినా బంగారం కొనుగోళ్లు అంతంత మాత్రంగానే సాగాయి. బంగారం ధరలు స్థిరంగా ఉండడం లేదు. 80వేల మార్కును దాటిన తరవాత కిందికి దిగి రావడం లేదు. రాకుండా వ్యాపారులు కూడా తమవంతు యత్నాలు చేస్తున్నారు. మరోవైపు బంగారం ధర స్థిరంగా ఉన్నప్పటికీ, అటు వెండి ధరలు మాత్రం పెరిగాయి. ఇక కిలో వెండి ధర రూ. లక్షకు చేరుకుంది. పరిశ్రమల యూనిట్లు, నాణెపు తయారీ పరిశ్రమల నుంచి డిమాండ్ పెరగడంతో వెండి ధర పెరిగింది. పుత్తడి ధరలు పెరగడంతో గత సంవత్సరంతో పోలిస్తే అమ్మకాలు కనీసం 30 నుంచి 50 శాతం తగ్గుతాయని మార్కెట్ వర్గాల అంచనా. అయితే దీపావళి, ధంతేరస్ పర్వదినాల సందర్భంగా కొనుగోళ్లు పుంజుకుంటాయని ఆభరణాల పరిశ్రమ ఆశించింది. రికార్డు స్థాయిలో ఎగిసిన పుత్తడి ధరలు స్వల్పంగా తగ్గుముఖం పట్టడంతో కస్టమర్ల తాకిడి ఆశాజనకంగా వుంటుందని భావిస్తున్నారు. దేశీయంగా రిటైల్ మార్కెట్లో కూడా బంగారం పెరుగుతోంది. పెళ్లిళ్ల సీజన్‌లో పసిడి లాభాల సిరులు కురిపిస్తుందనే అంచనాల్లో ఉన్నారు. దీపావళి అంటే దివ్వెలు, వెలుగుల సంబరం మాత్రమేకాదు. పసిడి కాంతుల కళకళలు కూడా. దసరా, దీపావళి పండుగ సీజన్ వచ్చిందంటే నగల వ్యాపారులకు బోలెడన్ని ఆశలు. లక్ష్మిదేవిని పూజించడం ఎంత ముఖ్యంగా భావిస్తారో... దీంతో పాటు బంగారం గానీ, ఏదో ఒక కొత్త వస్తువు కొనడం కూడా అంతే ఆనవాయితీ వస్తున్న క్రమంలో వారికి భారీ అంచనాలే ఉన్నాయి. అయితే ఇటీవల రికార్డు స్థాయికి చేరిన పసిడి దరలు దీపావళి నాటికి దిగి వస్తాయా అని కొనుగోలుదారులు ఆశగా ఎదురుచూస్తోంటే.. కొనుగోళ్లతో తమ షాపులు కళకళ లాడతాయా లేదా అని వ్యాపారులు ఆందోళనపడుతున్నారు. కొనుగోలుదారులు దీపావళికి ఎంతో కొంత బంగారాన్ని తమ సొంతం చేసుకోవాలనే ఆలోచనలో ఉంటారు. అయితే ఆకాశాన్నంటిన ధరలు మరింత దిగిరాకపోతాయా అనే మీమాంసలో చాలా మంది కొనుగోలు దారులున్నారు. క్షణక్షణానికి మారుతున్న అంతర్జాతీయ పరిస్థితుల నేపథ్యంలో పుత్తడి ధర ఏ రోజు ఎంత పెరుగుతుందో.. ఎంత తగ్గుతుందో అంచనా వేయడం ఒకింత కష్టంగా మారింది.

## మీడియా రంగంలో అడ్డు అదుపులేకుండా విలీనాలు

న్యూఢిల్లీ, ఇటీవలి కాలంలో మీడియా రంగంలో విలీనాలు, భాగస్వామ్య ఒప్పందాలు పెద్ద ఎత్తున జరిగిపోతున్నాయి. దేశంలో పోటీతత్వాన్ని ప్రోత్సహించేందుకు, పోటీపై ప్రభావం చూపే కార్యకలాపాలను నియంత్రించేందుకు 2003లో ఏర్పడిన కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) చేష్టలుడిగి చూస్తూండి పోవడంతో విలీనాలు, ఒప్పందాలు అడ్డూ అదుపూ లేకుండా సాగుతున్నాయి. ఉదాహరణకు రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్)ని తీసుకుందాం. అది ఓ పారిశ్రామిక గ్రూపు. కానీ ఇప్పుడు మీడియా రంగంలో విస్తరిస్తోంది. ఇందుకు దేశాన్ని పరిపాలిస్తున్న ప్రభుత్వమే కారణం. మీడియా రంగంలో ఆర్ఐఎల్ విస్తరణ సీసీఐ బలహీనతకు అద్దం పడుతోంది. ఇటీవల ఆర్ఐఎల్, అతి పెద్ద అంతర్జాతీయ మీడియా సంస్థ డిస్నీకి చెందిన భారతీయ విభాగం చేతులు కలిపాయి. దేశంలోని వివిధ మీడియా సంస్థలను కొనుగోలు చేయడం, వాటితో ఉమ్మడి భాగస్వామ్యాన్ని నెలకొల్పుకోవడం లేదా వాటిలో విలీనం కావడం పేరు ఏదైనా ఈ రంగంలో రిలయన్స్ వేళ్లూనుకుపోతోందని చెప్పడానికి ఇవి ఉదాహరణలు.తాజాగా ఆర్ఐఎల్, వయాకామ్ 18, డిస్నీ చేతులు కలిపాయి. నూతన సంస్థలో వీటికి వరుసగా 16 శాతం, 46 శాతం, 36 శాతం వాటాలు ఉన్నాయి. కానీ ఇది రిలయన్స్ నియంత్రణలోనే ఉంటుంది. ఎందుకంటే వయాకామ్ 18లో మెజారిటీ వాటాలు రిలయన్స్వే. వాస్తవానికి గత దశాబ్ద కాలంగా మీడియా, కమ్యూనికేషన్ పరిశ్రమలలో ఆర్ఐఎల్ విస్తరిస్తూనే ఉంది. 2012లో మీడియా రంగంలో ప్రవేశించింది. బహు భాషా వ్యవస్థలను కలిగిన టీవీ–18, ఈటీవీని చేజిక్కించుకుంది. టీవీ వినోద విభాగంలో ముఖ్య భూమిక పోషిస్తున్న వయాకామ్ 18 యాజమాన్యం కూడా రిలయన్స్ చేతికే వచ్చింది. అయినప్పటికీ వార్త, వినోద విభాగాలలో ప్రత్యర్థి నెట్వర్క్‌ల ప్రాభవం ఏ మాత్రం మసకబారలేదు. అయితే ఇటీవలి ఒప్పందంతో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. 2023లో దేశంలో మొదటి పది స్థానాలలో నిలిచిన ప్రసార సంస్థలలో వయాకామ్ 18, డిస్నీ 40 శాతం ఉన్నాయి. మొత్తం ప్రేక్షకులలో ఈ రెండింటి వాటా కలిపి 40 శాతం దాటింది. 2016లో రిలయన్స్ ఇండస్ట్రీస్ జియోని ప్రారంభించడం ద్వారా మొబైల్ టెలికమ్యూనికేషన్స్ రంగంలో అడుగు పెట్టింది. ప్రభుత్వ లోపభూయిష్ట విధానాల కారణంగా జియో సామ్రాజ్యం విస్తరించింది. మొబైల్ టెలికమ్యూనికేషన్ లైసెన్స్ పొందిన తర్వాత జియో ఇతర మొబైల్ ప్రొవైడర్ల నుండి వినియోగదారులను దూరం చేసింది. అటు సీసీఐ కూడా ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో పడిపోయింది. రిలయన్స్, డిస్నీ సంస్థలకు సీసీఐ 100 ప్రశ్నలు సంధించినప్పటికీ అవి ఏమిటో, వాటికి ఆ సంస్థలు ఇచ్చిన సమాధానమేమిటో ఎవరికీ తెలియదు. తాజాగా మూడు సంస్థల మధ్య కుదిరిన భాగస్వామ్య ఒప్పందంతో వాటికి మార్కెట్‌పై పూర్తి ఆధిపత్యం వచ్చింది.

# కర్నూలు మార్కెట్లో రైతులు కన్నీళ్లు



కర్నూలు : ఉల్లి రైతన్నలను కంట కన్నీరు ఉబుకుతోంది. అహోరాత్రులు స్వేదంతో శ్రమించి కన్నబిడ్డలా కాపాడుకున్న ఉల్లి బిడ్డ ధర నీరసంతో మార్కెట్ మంచంపై దొర్లుతుంటే.. రైతన్న తల్లడిల్లుతున్నాడు. ఉల్లి ధర కోసం పడిగాపులు కాస్తున్నాడు. అప్పు చేసి పెట్టుబడి పెడితే.. పంట దిగుబడి పెరిగినా.. దళారుల దెబ్బతో రైతు కంటిమీద కునుకు లేకుండా పోయింది. ఎన్నో ప్రయాసలుపడి సరుకును మార్కెట్‌కు తీసుకెళ్తే కొనే నాథుడు కనపడటం లేదు. ఈ స్థితిలో కర్నూలు ఉల్లి మార్కెట్‌లో టన్నుల కొద్దీ ఉల్లి పేరుకుపో తోంది.చరిత్రలో ఎన్నడూ లేని విధంగా కర్నూలు విపణిలో ఉల్లి ఉత్పత్తులు భారీగా పెరిగాయి? నిన్నా మొన్నటి వరకు అధిక ధరలతో వినియోగదారుడికి కన్నీరు పిండిన ఉల్లి వ్యాపారులు.. తాజాగా ఉల్లి రైతును గుక్క తిప్పుకోనీయటం లేదు. కర్నూలు ఉల్లి మార్కెట్ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా ఈ ఏడాది కర్నూలు వ్యవసాయ విపణికి ఉల్లి పోటెత్తుతోంది.గత నెల రోజులుగా ఉల్లి ధరలు ఆశాజనకంగా ఉండటంతో రైతులు వరుస కట్టారు. నిత్యం రికార్డు స్థాయిలో 22 వేల క్వింటాళ్ల వరకు సరుకు వస్తోంది. వ్యాపారులు కొనుగోలు చేసిన సరుకును సకాలంలో బయటకు తరలించకపోవటంతో నిల్వలు భారీగా పేరుకుపోయాయి. ఉల్లి గుట్టలు ఖాళీ చేసిన తర్వాతనే సరకును కొనుగోలు చేయాల్సి ఉంటుందని అధికారులు ప్రకటించారు. దీంతో మిగతా రైతులంతా నిరీక్షించాల్సి వస్తోంది.

కర్నూలు మార్కెట్లో ఈ కన్నీళ్లు..

ఉల్లి కొనుగోళ్లకు కర్నూలు మార్కెట్ ప్రసిద్ధి. ఇక్కడికి ఉమ్మడి కర్నూలు జిల్లా రైతులు సహా అనంతపురం, తెలంగాణ రాష్ట్రం జోగులాంబ గద్వాల జిల్లా రైతులు సరుకు తీసుకొస్తుంటారు. ఈ సీజన్‌లో ఆగస్టు నుంచి విక్రయాలు ప్రారంభమయ్యాయి. ధర ఆశాజనకంగా ఉండటంతో రైతులంతా మార్కెట్‌కు వరుస కట్టారు. గత 3రోజుల వ్యవధిలో 75వేల క్వింటాళ్లు వచ్చిందంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇంత సరుకు వస్తున్నా మార్కెట్‌లో చోటు లేకపోవటంతో కొందరు రైతులు తమ పంటను ఇంటికి తీసుకెళున్నారు. తాడేపల్లిగూడెంలోని ఉల్లి మార్కెట్‌కు తరలించాలని భావిస్తున్నా అక్కడ కూడా ధరలు తక్కువగా ఉండటం, రవాణా ఖర్చులు తడిసి మోపెడు అవుతుండటంతో ఏం చేయాలో దిక్కుతోచని పరిస్థితి నెలకొందని చెబుతున్నారు.

ఈ నామ్ లేదు.. తప్పని గ్రేడింగ్ ఖర్చు

కర్నూలు వ్యవసాయ మార్కెట్‌లో అనధికారిక వ్యాపారాలు చేయకూడదు. పంటను ఈనామ్ విధానంలో కొనుగోలు చేయాలి. సర్వర్ పనిచేయకపోవటంతో రెండు రోజులు టెండర్ విధానంలో కొనుగోలు చేశారు. కానీ కొందరు వ్యాపారులు, దళారులు కుమ్మక్కై రైతుల నుంచి పెద్దఎత్తున అనధికారిక విక్రయాలు చేస్తున్నారు. బహిరంగ మార్కెట్‌లో సరాసరి ఉల్లి కిలో 50 రూపాయలు పలుకుతుండగా రైతుల నుంచి క్వింటా 1000 నుంచి 1500కు కొనుగోలు చేస్తున్నారు. అంటే కిలో ఉల్లిని అత్యధికంగా 15 రూపాయలకు కొంటున్నారు. ఈ వ్యవహారం అధికారులకు తెలిసినా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.ఈ–నామ్ విధానం అమలవుతున్న విపణుల్లో సాంకేతిక సమస్యలు తలెత్తాయి. గత వారం వ్యవధిలో అంటే ఈనెల 21 నుంచి 26 వరకు ఆరు రోజులపాటు సాంకేతిక సమస్య తలెత్తటంతో ఈ నామ్ విధానంలో కొనుగోళ్లు ఆగిపోయాయి. గత వారం చివర్లో వ్యాపారులు మాన్యువల్‌గా టెండర్లు వేశారు. టెండర్లు వేసే ప్రక్రియ పూర్తయి ధర ప్రకటించడంలో తీవ్ర జాప్యం జరిగింది. గతంలో ఇంతకంటే అధిక మొత్తంలో అన్నిరకాల పంట ఉత్పత్తులు వచ్చిన సమయంలోనూ ఏనాడు మార్కెట్‌లో క్రయవిక్రయాలు ఆపేసిన దాఖలాలు లేవు. మార్కెట్ అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోవడం వ్యాపారులు, రైతులను సమన్వయం చేసుకోకపోవడంలో విఫలమయ్యారన్న ఆరోపణలు ఉన్నాయి. ఉల్లికి కుళ్లిపోయే గుణం ఎక్కువ. ఎప్పటికప్పుడు గ్రేడింగ్ చేయాలి. అలా చేస్తేనే వ్యాపారులు కొనుగోలు చేస్తారు. గ్రేడింగ్ చేయించుకోవడానికి అదనంగా ఖర్చు చేయాల్సి వస్తోంది. రోజువారీ వ్యాపారాలు జరగకపోవడంతో తరుగు పేరుతో 5 నుంచి 10 క్వింటాళ్ల సరుకు పారబోస్తున్నారు. గ్రేడింగ్ చేసినందుకు కూలీలకు అదనంగా డబ్బులు చెల్లించాల్సి వస్తోందని రైతులు ఆరోపిస్తున్నారు.

ఎగుమతులూ లేవు..

కొనుగోళ్లు సక్రమంగా లేక కర్నూలు వ్యవసాయ విపణిలో ఉల్లి నిల్వలు గుట్టలుగా పేరుకుపోయాయి. వ్యాపారులు కొనుగోలు చేసిన సరుకు మార్కెట్ నుంచి బయటకు తరలించడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. కర్నూలు నుంచి కోల్‌కతా, తమిళనాడు, కేరళ, కటక్, గుజరాత్ తదితర ప్రాంతాలకు ఎగుమతి చేస్తారు. లారీలు దొరక్కపోవడంతో లోడింగ్‌లో జాప్యం జరుగుతోందని వ్యాపారులు చెబుతున్నారు. దీంతో వివిధ షెడ్లలో కలిపి సుమారు 6 వేల టన్నుల మేర పేరుకుపోయాయి. కర్నూలు ఉల్లి మార్కెట్‌లో కొనుగోళ్ల సమస్య ఓ వైపు వేధిస్తూ ఉంటే దళారులు మరో ఇబ్బందిగా మారారు. దళారులు రైతుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి మార్కెట్‌లోనే గ్రేడింగ్ చేసుకొని అధిక ధరలకు విక్రయిస్తున్నారు.మార్కెట్‌లోకి దళారులు, అనుమతి లేని వ్యాపారులను రానీయకుండా అడ్డుకట్ట వేయాల్సి ఉండగా అధికారులు పట్టించుకోవడం లేదు.

## కరువు మండలాలివే..

అమరావతి, ఖరీఫ్ సీజన్ 2024కి సంబంధించి ఐదు జిల్లాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా 54 మండలాలు కరువు ప్రభావితానికి గురయ్యాయని ఏపీ ప్రభుత్వం తెలిపింది. ఈ మేరకు ఆయా మండలాలను కరువు మండలాలుగా ప్రకటిస్తూ ఏపీ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. కర్నూలు, అనంతపురం శ్రీసత్యసాయి, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో ఉన్న ఈ 54 మండలాల్లో వర్షపాతం సాధారణం కంటే చాలా తక్కువగా నమోదు కావడంతో ఈ దుర్భిక్ష పరిస్థితులు నెలకొన్నాయని ఏపీ ప్రభుత్వం ఆ జీవోలో తెలిపింది. వీటిలోని 27 మండలాల్లో తీవ్రమైన దుర్భిక్షం ఉంటే.. మరో 27 మండలాల్లో దుర్భిక్ష పరిస్థితులు ఉన్నాయని పేర్కొంది. కలెక్టర్లు ఆయా జిల్లా గెజిట్‌లలో కరువు మండలాలను నోటిఫై చేసి అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా ఉత్తర్వులు జారీ చేశారు. అనంతపురం జిల్లాలోని నార్పల.. అనంతపురం శ్రీసత్యసాయి జిల్లాలోని తాడిమర్రి, ముదిగుబ్బ, తలుపుల.. అన్నమయ్య జిల్లాలోని గాలివీడు, చిన్నమండెం, సంబెపల్లె, టి.సుండుపల్లె, రాయచోటి, లక్కిరెడ్డి పల్లె, రామాపురం, వీరబల్లె, తంబళ్లపల్లె, గుర్రంకొండ, కలపడ, పీలేరు, కలికిరి, వాల్మీకిపురం, కురుబలకోట, పెద్దతిప్ప సముద్రం, బి.కొత్తకోట, మదనపల్లె, నిమ్మనపల్లె.. చిత్తూరు జిల్లాలోని పెనుమూరు, యాదమర్రి, గుడిపాల మండలాలను తీవ్ర కరువు మండలాలుగా నోటిఫై చేశారు. కర్నూలు జిల్లాలోని కౌతాలం, పెద్దకడుబూరు.. అనంతపురం జిల్లాలోని విడపనకల్, యాడికి, గార్లదిన్నె, బుక్కరాయసముద్రం, రాప్తాడు.. శ్రీసత్యసాయి జిల్లాలోని కనగానిపల్లి, ధర్మవరం, నంబుల పులకుంట, గాండ్లపెంట, బుక్కపట్నం, రామగిరి, పరిగి.. చిత్తూరు జిల్లాలోని శ్రీరంగరాజపురం, చిత్తూరు, శాంతిపురం, రొంపిచర్ల, పూతలపట్టు, సోమల, పుంగనూరు, పలమనేరు, బైరెడ్డిపల్లె, వెంకటగిరికోట, గుడుపల్లె, కుప్పం, రామకుప్పం మండలాలను కరువు మండలాలుగా గుర్తించారు.

## లాగేది ఆయనేనా ?

హైదరాబాద్,బీజేపీ తెలంగాణా మీద ఫోకస్ పెడుతోంది. జమిలి ఎన్నికల నేపథ్యంలో దక్షిణాదిన తెలంగాణా మీదనే బీజేపీ ఆశలు అధికంగా ఉన్నాయి. ఏపీలో జనసేన టీడీపీతో బంధం పటిష్టంగా ఉంది. దాంతో ఏ ఢోకా లేదు. తెలంగాణాలో 2024 ఎన్నికల్లో ఎనిమిది ఎంపీలను గెలుచుకున్న బీజేపీ ఈసారి ఎన్నికలు అంటూ వస్తే మరింతగా బలపడాలని లెక్కలు వేసుకుంటోంది.ఇక తెలంగాణా బీజేపీ అధ్యక్షుడిగా కేంద్ర మంత్రిగా జి కిషన్ రెడ్డి ఉన్నారు. ఆయన ప్రస్తుతం రెండు బాధ్యతలను మోస్తున్నారు. దాంతో ఆయన ప్లేస్ లో కొత్తవారిని ఎంపిక చేయాలని బీజేపీ చూస్తోంది. అయితే ఆ కొత్త వారు ఎవరు అన్నదే చర్చగా ముందుకు వస్తోంది.కేంద్ర సహాయ మంత్రిగా ఉన్న బండి సంజయ్ కి మరో మారు పార్టీ పగ్గాలు అప్పగించాలని కూడా టాక్ నడుస్తోందిట. ఆయన హయాంలో పార్టీ గ్రౌండ్ లెవెల్ దాకా వెళ్ళిందని పక్కా మాస్ లీడర్ గా బండి కమలం పార్టీకి దూకుడు పెట్టించాడు అని అంటున్నారు.బండిని గత ఏడాది ఆ పదవి నుంచి తప్పించారు. ఇపుడు చూస్తే ఒక వైపు కాంగ్రెస్ ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి దూకుడు ఉంది మరో వైపు చూస్తే బీఆర్ఎస్ కూడా జూలు విదిలిస్తోంది. ఈ రెండు పార్టీలను తట్టుకుని రాజకీయ క్షేత్రంలో నిలబడాలీ అంటే కచ్చితంగా పూర్తి స్థాయిలో పార్టీని పట్టించుకోవాల్సి ఉంది అని అంటున్నారు. దాంతో పాటు ఢీ అంటే ఢీ కొట్టే నాయకత్వం అవసరం అని కూడా అంటున్నారు. ఆ విధంగా చూసుకుంటే బండికే ప్రయారిటీ ఇస్తారు అని అంటున్నారు. అదే సమయంలో ఎంపీగా ఉన్న ఈటెల రాజేందర్ కి కూడా పగ్గాలు దక్కవచ్చు అని అంటున్నారు. ఆయనకు కేంద్ర మంత్రి పదవి ఇవ్వనిది అందుకే అని కూడా చెబుతున్నారు.ఈటెల కూడా తన ఈటెల లాంటి విమర్శల్తో ప్రత్యర్థులకు హడల్ పుట్టిస్తారు అని అంటున్నారు. అయితే ఈటెలను కేంద్ర మంత్రి వర్గంలోకి తీసుకుని బండికే పార్టీ బాధ్యతలు అప్పగించే చాన్స్ ఎక్కువగా ఉంది అని అంటున్నారు. ఇక కిషన్ రెడ్డి కేంద్ర మంత్రిగా ఉంటూ రాష్ట్ర పార్టీ విషయంలో అనుకున్న విధంగా స్పందించడం లేదని అంటున్నారు. తొందరలో స్థానిక సంస్థల ఎన్నికలు ఉన్నాయని అలాగే జీహెచ్ఎంసీ ఎన్నికల మీద కూడా బీజేపీ కన్ను ఉందని అంటున్నారు. గతసారి అధికంగా కార్పోరేటర్లను గెలుచుకుని బీజేపీ మేయర్ పీఠానికి చేరువగా వచ్చింది. ఈసారి మరింతగా దూకుడు చేస్తే అనుకున్నది నెరవేరు తుంది అన్న ఆశ ఉంది. మొత్తానికి తొందరలోనే తెలంగాణాకు కొత్త అధ్యక్షుడు వస్తారని అంటున్నారు. అది బండి నా లేకా ఈటెలనా అన్నది చూడాల్సి ఉంది.

## ఏపీలో ఉన్న వనరుల గురించి విశ్లేషణ

న్యూఢిల్లీ,అమెరికాలో పర్యటిస్తున్న ఏపీ మంత్రి నారా లోకేష్ లాస్ వెగాస్‌లో నిర్వహిస్తున్న ఐటి సర్వ్ సినర్జీ సమ్మిట్‌లో పాల్గొన్నారు. వివిధ కంపెనీ ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టాలని వారికి రిక్వస్ట్ చేశారు. ఏపీలో ఉన్న మానవ వనరులు, భూమి లభ్యత, వాతావరణ పరిస్థితులు వారికి వివరించారు. అమెజాన్ వెబ్ సర్వీసెస్ మేనేజింగ్ డైరక్టర్ రేచల్ స్కాఫ్‌ను కలిసి ఏపీలో పెట్టుబడుల అవకాశాలు పరిశీలించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు లోకేష్. "క్లౌడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లో ఆంధ్రప్రదేశ్ డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ లక్ష్యాల సాధనకు నాయకత్వం ఉపకరిస్తుంది. స్మార్ట్ గవర్నెన్స్ కోసం ఎపి ప్రభుత్వం రూపొందిస్తున్న ప్రణాళికల అమలులో క్లౌడ్ సేవలు కీలక పాత్ర వహించే అవకాశాలున్నాయి. ఏఐ మిషన్ లెర్నింగ్‌లో మీరు చూపిస్తున్న శ్రద్ధ, నిబద్ధత ఏపీని ఎఐ ఇన్నొవేషన్ కేంద్రంగా మార్చాలన్న మా ఆశయానికి ఊతమిస్తాయి. ఆంధ్రప్రదేశ్‌లో పబ్లిక్ సర్వీసెస్ డెలివరీ సిస్టమ్, డిజిటల్ గవర్నెన్స్ మెరుగుదల, ఈ–గవర్నెన్స్ కార్యకమాలకు సహకారం అందించాలి"అని కోరారు. పెప్సికో మాజీ ఛైర్మన్ సిఇఓ ఇంద్రానూయితో భేటీ అయ్యాను. చంద్రబాబు నేతృత్వంలో ఇన్వెస్టర్స్ ఫ్రెండ్లీ విధానాలు అమలుచేస్తూ వేగవంతమైన అభివృద్ధి దిశగా ఆంధ్రప్రదేశ్ ముందుకు సాగుతోందని వివరించారు. టెక్నాలజీ, తయారీరంగంలో విదేశీ పెట్టుబడులను ఆకర్షించడానికి ఏపీ ప్రభుత్వం చేపడుతున్న నిర్మాణాత్మక కృషిలో పెప్సికో భాగస్వాములు అవ్వాలని కోరారు. మహిళా నాయకత్వాన్ని ప్రోత్సహించడంలో ఏపీ ప్రభుత్వానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. సేల్స్ ఫోర్స్ ఏఐ సీఈవో క్లారా షిహ్?తో భేటీ అయ్యారు. టెక్ స్టార్టప్?లకు ఏఐ టూల్స్, మెంటార్‌షిప్ అందించాలని.. ఏఐ ఆధారిత పరిశ్రమల కోసం యువతకు శిక్షణ ఇవ్వాలని కోరారు. విద్యాసంస్థలతో సేల్స్ ఫోర్స్ సంస్థ భాగస్వామ్యం కావాలని విజ్ఞప్తి చేశారు. రెవేచర్ సిఇఓ అశ్విన్ భరత్‌తో సమావేశమయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో టెక్ టాలెంట్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను నెలకొల్పడానికి రెవేచర్ భాగస్వామ్యం వహించాలని కోరారు. రాష్ట్రంలో నైపుణ్య కార్యక్రమాలకు అనుగుణంగా సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, ఇతర డిమాండ్ ఉన్న ఐటి నైపుణ్యాల్లో యువతకు శిక్షణ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ కార్యక్రమాలకు మద్దతు ఇవ్వాలని కోరారు.

## 9 నుంచి యూరప్‌లో శ్రీనివాస కల్యాణోత్సవాలు

తిరుమల, టీటీడీ ఆధ్వర్యంలో నవంబరు, డిసెంబరు నెలల్లో యూకే, ఐర్లాండ్, యూరప్?ల్లో ఎనిమిది దేశాల్లోని 13 నగరాల్లో శ్రీనివాస కల్యాణం ఘనంగా నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమ నిర్వాహకులు సూర్య ప్రకాష్ వెలగా, కృష్ణ జవాజీ,లు మంగళవారం టీటీడీ ఈవో శ్యామలరావును తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో మర్యాదపూర్వకంగా కలిసి ఈ వేడుకల్లో పాల్గొనాలని ఆహ్వానించారు. టీటీడీ సహకారంతో స్థానిక స్వచ్ఛంద, సాంస్కృతిక సంస్థలతో కలిసి నవంబరు 9 నుంచి డిసెంబరు 21 వరకు ఏపీ ఎన్ఆర్‌టీ శ్రీనివాస కల్యాణం నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు ఈవోకు తెలిపారు. ఈ తిరు కల్యాణ కార్యక్రమాల్లో టీటీడీ వేదపండితులు వైఖానస ఆగమ సంప్రదాయం ప్రకారం పూజలు నిర్వహించనున్నారు. నవంబరు9న బెల్ఫాస్ట(ఐర్లాండ్), 10న డబ్లిన్(ఐర్లాండ్), యూకేలో 16న బేసింగ్‌స్టోక్(యూకే), 17న ఐండోహోవెన్(నెదర్లాండ్స్), 23న హాంబర్గ(జర్మనీ), 24న పారిస(ఫ్రాన్స్), 30న వార్సా(పోలాండ్), డిసెంబరు1న స్టాక్‌హోం(స్వీడన్), 7న మిల్టన్‌కీన్స్(యూకే), 8న గ్లౌసెస్టర్(యూకే), 14న ఫ్రాంక్‌ఫర్ట్(జర్మనీ), 15న బెర్లిన్(జర్మనీ), 21న జ్యూరిచ్(స్విట్జర్లాండ్)లో కల్యాణం నిర్వహించనున్నారు.

### చిత్రాల్లో దీపావళి పాటలకు ప్రత్యేకత

విజయవాడ,దీపావళి ప్రత్యేకతను, దాని విశిష్టతను చెప్పడానికి అనేక సినిమాల్లో అనేక పాటలు వచ్చాయి. సినీ కవులు పాటల్లో దాని పరమార్థాన్ని ఇనుమడింపజేశారు. తెలుగునాట దీపావళిపై వచ్చిన పాటలు తక్కువే అయినప్పటికీ వాటి మహత్యం మాత్రం చిన్నపాటిది కాదు. బ్లాక్ అండ్ వైట్ చిత్రాల కాలంలో వచ్చిన పాటల వైభవం ఇప్పటికీ ఏమాత్రం వన్నె తగ్గలేదు. ఇందుకు ఉదాహరణ.. విచిత్రబంధం సినిమాలో ఆచార్య ఆత్రేయ రాసిన 'జీవితమే ఒక దీపావళి..

# ఆర్థిక విధానాలను ఎన్‌డి పక్షాలు చర్చించాలి !

న్యూఢిల్లీ,గత దశాబ్ద కాలంగా మోడీ అనుసరిస్తున్న ఆర్థిక విధానాలు ప్రజల నడ్డి విరిచేలా చేస్తున్నాయి. ధరలు పెరగడం, పేదలు చితికి పోవడం అన్నది సమాంతరంగా సాగుతోంది. అయినా కిందిస్థాయిలో ఏం జరుగు తున్నదో తెలుసుకోలేక పోతున్నారు. కనీసం ఇప్పటికైనా ఎన్‌డిఎ పక్షాలు ఆలోచనచేయాలి. ప్రజలపై మోపుతున్నా భారాలను తగ్గించాలి. ధరల పెరుగుదలపై చర్చించాలి. మోడీ ఆర్థిక విధానాలను చర్చించాలి. లేకుంటే ఎన్‌డిఎ పక్షాలు కూడా ప్రజా వ్యతిరేకతను ఎదుర్కోక తప్పదు. కేవలం కార్పోరేట్ శక్తులు బలపడుతున్న తీరు ప్రజలను కలచి వేస్తోంది. పేద,సామాన్య ప్రజలు ఎంతగా చితికి పోతున్నారో గమనించడం లేదు. జిఎస్టీ కారణంగా వస్తువుల ధరలు పెరిగితే ఎవరికి నష్టమో ఆలోచన చేయడం లేదు. దేనిని వదలకుండా జిఎస్టీ పరిధిలోకి తీసుకుని వచ్చినంత మాత్రాన, ప్రభుత్వ ఆదాయం పెరిగినంత మాత్రాన ఆర్థిక సంస్కరణలు భేషుగ్గా ఉన్నాయంటే ఎవరిని వంచించడానికి అన్నది బిజెపి పాలకులు ఆలోచన చేయాలి. ఎన్‌డిఎ భాసగ్వామ్య పక్షాలైన టిడిపి, జనసేన, ఇతర పార్టీలు కదా దీనిని విశ్లేషించాలి. తాను పట్టిన కుందేటికి మూడే కాళ్లు అన్నచందంగా మోడీ ఉన్నారే తప్ప ఫలితాలను విశ్లేషించుకుని తప్పులను సరిదిద్దుకుందామన్న లక్ష్యాన్ని ప్రకటించడం లేదు. ప్రజల జీవన స్థితిగతులను పట్టించుకోవడం లేదు. ప్రధాని మోడీ కేవలం తాను అనుసరించిన ఆర్థిక విధానాలను ప్రజలు ఆమోదించారంటూ, చెప్పు కోవడం ఆత్మవంచన తప్ప మరోటి కాదు. కేవలం కాంగ్రెస్ ను, విపక్షాలను తిట్టిపోస్తూ రాజకీయం చేయడమే పాలన కాదు. పాలనలో కొత్త ఒరవడి సృష్టించాలి. ప్రజలకు మేలు జరిగేల సంస్కరణలు ఉండాలి. నిరుద్యోగులకు ఉద్యోగాలు రావాలి. ఆహరధాన్యాల ధరలు తగ్గాలి. ఎక్కడ తప్పిదం జరిగిందో పరిశీలన చేయాలి. ప్రజలకు గుజరాత్ మోడల్ అంటూ ప్రచారం చేసి, ప్రధాని పదవిని చేపట్టిన మోడీపై ప్రజలకు విశ్వాసం ఉంటే పరిస్థితులు ఇంత అధ్వాన్నంగా ఎందుకు ఉంటాయి. ప్రజల్లో నివురుగప్పిన అసంతృప్తిని గమనించి సర్దుకోకపోతే వాత తప్పదని మొన్నటి ఎన్నికల ఫలితాల ద్వారా ప్రజలు కొద్దిగా రుచి చూపారు. ఇటీవలి ఎన్నికల్లో ప్రధాని తన వ్యక్తిగత ప్రతిష్ఠను పణంగా పెట్టి ప్రచారం చేశారు. ప్రజల్లో గూడుకట్టుకున్న అసంతృప్తిని తొలగించలేకపోతున్నామని గమనించాలి. సంస్కరణలంటే ప్రజల జీవన ప్రమాణాలు మారాలని గుర్తుంచుకోవాలి. 2014లో మోడీ అధికారంలోకి వచ్చిన తరవాత ధరలను, నేటి మార్కెట్ ధరలను ఎందుకు బేరీజు వేసుకోవడం లేదో ప్రధాని మోడీ ప్రజలకు సమాధానం చెప్పాలి. ఇంతకాలం కాంగ్రెస్ పార్టీ బలహీనంగా ఉన్నా, గట్టిగా పోటీ పడలేకపోయినా ప్రజల ఆలోచనలు కాంగ్రెస్ వైపు మళ్లేలా చేసింది ప్రధాని మోడీ అని గుర్తించాలి. ఇకముందు కాంగ్రెస్ పార్టీ నుంచి గట్టి సవాలు ఎదురవుతుందని భావించాలి. దానికి కాంగ్రెస్ గొప్పతనం కాకుండా మోడీ అనుసరిస్తున్న పిడివాద సంస్కరణల ఫలితమని గుర్తించాలి. హర్యానాలో మళ్లీ అధికారం నిలబెట్టు కోవడం..బిజెపికి ప్రజలు వత్తాసు పలుకుతున్నారని అనుకోరాదు. కాంగ్రెస్ పార్టీ వచ్చే ఎన్నికల్లో రెట్టించిన ఉత్సాహంతో పనిచేస్తుందనడానికి కాశ్మీర్, హర్యానా ఫలితాలే ప్రత్యక్ష నిదర్శనం. తాము ప్రవచిస్తున్న సంస్కరణలు ఎక్కడ దారితప్పాయో గమనించాలి. పివి నరసింహారావు లాగా సంస్కరణలు ప్రజలకు ఎందుకు వేలు చేయలేకపోతున్నాయో పరిశీలన చేయాలి. ఇప్పటికైనా నోట్లరద్దు,జిఎస్టీ విపరిణామాలను విశ్లేషించుకోవాలి. విమర్శలను హెచ్చరికగా తీసుకుని ముందుకు సాగితే తప్ప మనలేమని మిత్రద్వయం గుర్తించి ప్రజలకు మేలుచేసే సంస్కరణలను అమలు చేయాలి. అప్పుడే బిజెపి తన అస్తిత్వాన్ని నిలుపుకోగలదు. ఇకపోతే అధికారంలోకి వస్తే సంవత్సరానికి 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని మభ్య పెట్టిన మోడీ ఆ ఊసే ఎత్తడం లేదు. పదేళ్లు కావస్తోంది. స్వయం ఉపాధి పేరుతో నిరుద్యోగులను మభ్యపెడు తున్నారు. గత పదేళ్లలో.. కొత్త ఉద్యోగాలు ఇవ్వకపోగా కార్మిక వ్యతిరేక విధానాలతో



వేలాది పరిశ్రమలు మూతపడడానికి కారణం అయ్యారు.బిజెపి ప్రభుత్వ అనాలోచిత, ఏకపక్ష విధానాలు రోజురోజుకు ప్రమాదకరంగా మారుతున్నాయి. పెరుగుతున్న అధిక భారాలు, పన్నులు, నిరుద్యోగం, నూతన విద్యావిధానం, ప్రభుత్వ రంగసంస్థల ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ, రాజ్యాంగ వ్యవస్థల్లో అనుచిత జోక్యం, రక్షణ రంగంలో ఉద్యోగాల కోతకు వ్యతిరేకంగా దేశ ప్రజలు పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ కారణంగా కనీసం 6 కోట్ల మందికి ఉపాధి పోయిందని అంచనా. అన్ని సంస్థలను ప్రైవేటుకు అప్పగించే పనిలో మాత్రం వేగం పెంచారు. రైల్వేరంగాన్ని కార్పోరేట్ సంస్థలకు అప్పనంగా అప్పజెప్పుతున్నారు. విశాఖ ఉక్కును నష్టాల పేరుతో విదేశీ కంపెనీలకు అమ్మివేసే ప్రయత్నం చేస్తున్నారు. పండించిన పంటకు గిట్టుబాటు ధరలేక, దిగుబడిలేక ఎంతో మంది రైతులు అప్పులపాలై ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. కరోనా వైరస్ కష్టకాలంలో ఉపాధి లేక వేలాదిమంది ఆకలితో అలమటించారు. ఆసుపత్రులకు డబ్బులు కట్టలేక ఆస్తులు అమ్ముకున్నారు. ఎందరో ప్రాణాలు కోల్పోయారు. అలాంటి వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయి. ఆనాటి పరిస్థితులను చూసి చలించిన ఎందరో వారిని దగ్గరికి తీసి, వారి ఆకలిని తీర్చి వారిని వారి గమ్యస్థలాలకు చేర్చే ప్రయత్నం చేశాయి. కానీ ప్రభుత్వం మాత్రం వారిని గాలికొదిలేసింది. మహిళలపై అత్యాచారాలు ఎక్కువయ్యాయి. కొన్ని ప్రాంతీయ పార్టీలు కూడా బిజెపి విధానాలను వ్యతిరేకించకుండా అనుకూల రాజకీయాలు చేస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం దేశ విదేశీ కార్పొరేట్లకు వివిధ రకాల రాయితీలు, కానుకలు సమర్పిస్తూ వారిని మరింత సంపన్నవంతం చేయడం దారుణం. భారత రిజర్వు బ్యాంకు గణాంకాల ప్రకారం సగటున ఏడాదికి రెండు లక్షల కోట్ల రూపాయల రుణాలు సంపన్నులకు రద్దయ్యా యన్నది గుర్తించాలి. కార్పొరేట్లు తీసుకున్న రూ.4.5 లక్షల కోట్ల బ్యాంకు రుణాల్లో కేవలం రూ. 1.61 లక్షల కోట్లు మాత్రమే వన్‌టైమ్ సెటిల్‌మెంట్ పేరుతో వసూలు చేశారు. అంటే బ్యాంకులు రూ.2.85 లక్షల కోట్లు కోల్పోయాయి. ఇలా బ్యాంకుల సొమ్ము కార్పొరేట్ల పాలు అవుతోంది. మోడీ ప్రభుత్వం వచ్చాక పరోక్ష పన్నులను, సెస్సులను పెంచి జనంపై భారాలు పెంచి, ప్రత్యక్ష పన్నుల్లో కార్పొరేట్లకు వివిధ రూపాల్లో రాయితీలు కల్పిస్తోంది. బడ్జెట్లో దాదాపు 8శాతం కార్పొరేట్ పన్ను రాయితీల ద్వారా వారికి లక్షల కోట్ల రూపాయల లబ్ది చేకూర్చింది. మరోవైపు ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించి వాటిని కార్పొరేట్లకు కట్టబెడుతున్నారు. ఇలా అన్ని విధాలుగా సంపన్నులకు ప్రజల సంపదను దోచిపెడుతున్న సర్కారు సామాన్య రైతులు, సాధారణ ప్రజలపట్ల మాత్రం కర్కశంగా వ్యవహరిస్తోంది. కరువు కాటకాల వలన, వరదలు, తుపాను వలన నష్టపోయి లేదా పంటకు న్యాయమైన ధర దక్కక తీవ్రంగా నష్టపోయిన కారణంగా బ్యాంకులో తీసుకున్న రుణం తిరిగి తీర్చలేని రైతుల నుండి మాత్రం ఎటువంటి మినహాయింపు లేకుండా వసూలు చేయాలని బ్యాంకులను సర్కారు ఆదేశిస్తుంది. ఈ పదేళ్లలోనే పది లక్షల కోట్ల రూపాయలకు పైగా కార్పొరేట్లకు మాఫీ చేస్తే ఆర్థిక క్రమశిక్షణ ఏమయినట్లో మోడీ సర్కారే చెప్పాలి.

## ప్రాణాంతక మయోనైజ్‌పై నిషేధం

హైదరాబాద్,ప్రాణాలను హరిస్తున్న మయోనైజ్‌పై నిషేధం విధించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ఆహార ప్రియులు ఎంతో ఇష్టంగా తినే మయోనైజ్ ప్రాణాంతకంగా మారడంతో దీనిపై నిషేధం విధించాలని నిర్ణయించింది. కల్తీ ఆహారం తీసుకొని పలువురు తీవ్ర అనారోగ్యం పాలవుతోన్న ఘటనల నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఫుడ్ సేఫ్టీ విభాగం అధికారులతో సమీక్ష అనంతరం వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు ఫుడ్ సేఫ్టీ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేయనున్నారు. రాష్ట్రంలో హోటళ్లు, ఫుడ్‌స్టాళ్లలో తరచూ తనిఖీలు చేయాలని సంబంధిత శాఖ అధికారులకు ఈ సందర్భంగా మంత్రి సూచించారు. రాష్ట్రంలో కొత్తగా 3 ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్‌లు, 5 మొబైల్ ఫుడ్ సేఫ్టీ ల్యాబ్స్ ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. మయోనైజ్‌ను ఎక్కువగా.. మండి బిర్యానీ, కబాబ్‌లు, పిజ్జాలు, బర్గర్లు, శాండ్‌విచ్‌లు, ఇతరత్రా ఆహార పదార్థాల్లో చెట్నీలా వేసుకుని తింటారు. ఇటీవల జరుగుతున్న వరుస ఘటనలతో బల్దియా ఆహార కల్తీ నియంత్రణ విభాగం అప్రమత్తమైంది. ఎన్నిసార్లు చెప్పినా హోటళ్లు తీరు మార్చుకోవట్లేదంటూ ప్రభుత్వానికి లేఖ రాసింది. ఆ పదార్థాన్ని నిషేధించేందుకు అనుమతి కోరింది. బంజారాహిల్స్‌లోని నందినగర్, సింగాడకుంట బస్తీ, గౌరిశంకర్‌కాలనీలలో గత శుక్రవారం సంత జరిగింది. అక్కడ ఏర్పాటు చేసిన 'దిల్లీ హాట్ మోమోస్' దుకాణంలో విక్రయించిన మాంసాహార మోమోస్, వాటితోపాటు ఇచ్చిన మయోనైజ్, చట్నీని బస్తీకి చెందిన రేష్మబేగం, ఆమె పిల్లలు రుమ్మా, రఫియా తిన్నారు. అదేరోజు రాత్రి ముగ్గురికీ వాంతులు, విరేచనాలు అయ్యాయి. పిల్లలిద్దరినీ ఆసుపత్రిలో చేర్చగా తల్లి ఇంట్లోనే ఉంది. ఆదివారం రేష్మబేగం (31) పరిస్థితి విషమించడంతో నిమ్స్‌కు తరలిస్తుండగా మధ్యలోనే మరణించింది. అల్వాల్‌లోని గ్రిల్ హౌజ్ హోటల్‌లో నాసిరకం మయోనైజ్‌ను తిన్న కొందరు యువకులు ఇటీవల ఆసుపత్రిపాలయ్యారు. వారం కిందట ఐదుగురు వాంతులు, విరేచనాలతో స్థానిక ఆసుపత్రిలో చేరడంతో విషయం వెలుగులోకి వచ్చింది. ఈ ఏడాది జనవరి 10న కూడా ఇలాంటి ఘటనే జరిగింది. అదే హోటల్‌లో షవర్మ తిన్న 20 మందికిపైగా యువకులు 3, 4 రోజులయ్యాక ఆసుపత్రుల్లో చేరాల్సి వచ్చింది. కొంతమందికి రక్త పరీక్షలు చేయగా.. హానికర సాల్మనెల్లా బాక్టీరియా ఉన్నట్లు వైద్యులు తేల్చారు.

# మహా యుద్ధంలో వెనక్కు తగ్గడానికి కారణమిదే!



హైదరాబాద్,అంతన్నారు, ఇంతన్నారు. ఎంతో అన్నారు. చివరికి ఎటూ కాకుండా పోయారా? బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేయాలనుకున్న రాజకీయం రివర్స్ అయిందా అంటే అవునన్న సమాధానమే వస్తోంది. ఎందుకంటే ఇప్పుడు మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్నాయి. తాము అధికారంలో ఉన్నప్పుడు ఎంతో చెప్పి.. మహారాష్ట్రలో పుణ్యక్షేత్రాలు తిరిగి, కీలక నేతలను చేర్చుకుని.. అసలైన యుద్ధం వచ్చే సరికి జెండా ఎత్తేశారు. ఎందుకిలా జరిగింది? కేసీఆర్ వెనక్కు తగ్గడానికి కారణాలేంటి?రాజకీయాల్లో ఎవరైనా, ఎన్నైనా కలలు కనొచ్చు. కానీ అవన్నీ నిజమవుతాయా? అంటే కానే కాదన్నది కేసీఆర్ చేసిన ఓ విఫల ప్రయోగం చూస్తే అర్థమవుతుంది. తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా 2001 ఏప్రిల్ 27న తెలంగాణ రాష్ట్ర సమితి ఆవిర్భవించింది. 2014లో తెలంగాణ వచ్చింది. రెండుసార్లు టీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు కూడా చేసింది. అయితే రెండోసారి గెలవగానే కేసీఆర్ చాలా ఊహించుకున్నారు. దేశ రాజకీయాలను మార్చేస్తాననుకున్నారు. ఎన్డీఏ, ఇండియా కూటములు కాదు.. ఫెడరల్ ఫ్రంట్ రావాలన్నారు. అబ్ కీ బార్ కిసాన్ సర్కార్ అన్నారు. మహారాష్ట్ర, ఏపీలో పోటీకి సై అన్నారు. మధ్యప్రదేశ్, ఒడిశాలోనూ పార్టీ విస్తరించాలనుకున్నారు. నేతల్ని చేర్చుకున్నారు. ఒక్కటేమిటి ఎన్నెన్నో ఊహించుకున్నారు. ఎంతో అనుకున్నారు. ఇవన్నీ జరగాలంటే పార్టీ పేరు మార్చాలనుకున్నారు. 2022 అక్టోబర్ 5న తెలంగాణ రాష్ట్రసమితిగా ఉన్న పార్టీ పేరును భారత రాష్ట్ర సమితి $\%$దీ=ూ$\%$గా మార్చేశారు.భారత రాష్ట్ర సమితిగా పేరు మార్పు కేసీఆర్ కు అస్సలు అచ్చి రాలేదు. ఎందుకంటే తెలంగాణతో పేగు బంధం తెంపేసుకున్నారని తెలంగాణ ప్రజలు మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో ఘోరంగా ఓడించారు. ఇక పార్లమెంట్ ఎన్నికల్లో అయితే గుండు సున్నా సీట్లు కట్టబెట్టారు. లెక్కలన్నీ మారిపోయాయి. రాజకీయ చాణక్యం అంటే కేసీఆర్ దే అన్న ప్రచారం గులాబీ దళంలో ఉండేది. కానీ పరిస్థితులు అన్నీ ఒకేలా ఉండవు కదా.. కథ మొత్తం మారిపోయి సొంత రాష్ట్రంలోనే పార్టీ అడ్రస్ గల్లంతు అయ్యే పరిస్థితి వచ్చింది. గెలిచిన 39 మంది ఎమ్మెల్యేల్లో 10 మంది ఇప్పటికే కాంగ్రెస్ లో చేరిపోయారు. సో ఇప్పుడు కేసీఆర్ టాపిక్ ఎందుకంటే $\%$ౄ$\%$ తాను ఎంతగానో ఊహించుకున్న మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ల ఘట్టం కూడా ముగిసింది. అక్కడ షెడ్యూల్ వెలువడ్డా అసలు ఉలుకూ పలుకూ లేకుండా పోయింది. ఎందుకంటే మహారాష్ట్రపై గతంలో చాలా ఆశలు పెట్టుకున్నారు. కానీ అసలైన టైంలో చేతులెత్తేశారు. బ్యాడ్ టైంలో ప్రయోగాలు ఎందుకని సైలెంట్ గా ఉన్నారా లేక, మరేమైనా జరిగిందా అన్నది ఇంట్రెస్టింగ్ గా మారింది.మరత్వాడ, విదర్భ ప్రాంతాలు తెలంగాణతో సరిహద్దుగా ఉన్నాయి. సో ఎలాగైనా తమ ఎఫెక్ట్ చూపొచ్చు అనుకున్నారు. సరిహద్దులోని మహారాష్ట్ర గ్రామాలను టార్గెట్ చేశారు. సభలు సమావేశాలు నిర్వహించారు. సరిహద్దు సెగ్మెంట్ల ఎమ్మెల్యేలను నాడు ఇంఛార్జ్ లుగా కూడా పెట్టారు. తెలంగాణలో అమలైన రైతుబంధు, రైతుబీమాతో అక్కడి రైతులు ఆకర్షితులైనట్లు, తమ ఊళ్లను తెలంగాణలో కలపాలని డిమాండ్లు కూడా చేసినట్లు అప్పట్లో ప్రచారాలు చేసుకున్నారు. అయితే మహారాష్ట్రలో ఎంట్రీ కోసం గతంలో చాలా పెద్ద కథే నడిచింది. మరత్వాడా, విదర్భ ప్రాంతాల్లో సమావేశాలను నిర్వహించారు గులాబీ బాస్. మహారాష్ట్రలో బీఆర్ఎస్ ను ఆదరిస్తే.. తెలంగాణలో అమలవుతున్న పథకాలను మహారాష్ట్ర రైతులకూ వర్తింపజేస్తామన్నారు.జాతీయ స్థాయిలో సత్తాచాటాలని మహారాష్ట్ర, కర్ణాటక, మధ్యప్రదేశ్, ఒడిశా, బిహార్ లో కేసీఆర్ పర్యటించి అక్కడ కూడా పార్టీ శాఖలను ఏర్పాటు చేశారు. అయితే అన్నిటికంటే ఆయన మహారాష్ట్రపైనే ఎక్కువ ఫోకస్ పెట్టారు. నాగపూర్, సోలాపూర్, నాందేడ్ ప్రాంతాలలో పార్టీ కార్యాలయాలు కూడా ప్రారంభించారు. కొన్ని ప్రాంతాల్లో ఎన్సీపీ, కాంగ్రెస్, శివసేనల నుంచి నాయకులు బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. కేసీఆర్ తెలంగాణలో అధికారంలో ఉన్నప్పుడు వందలాది కార్ల కాన్వాయ్ తో సోలాపూర్ జిల్లాలోని పండరీపూర్ విఠలేశ్వర్ మందిరాన్ని దర్శించుకున్నారు. అలాగే ఉస్మానాబాద్ జిల్లాలోని తుల్జా భవానీ టెంపుల్ దర్శించుకున్నారు. తీర్థయాత్రలు చేశారు. బహిరంగ సభలు నిర్వహించుకున్నారు. మహారాష్ట్ర రైతుల పరిస్థితి ఇలా ఎందుకుందని ప్రశ్నించారు. తాము వస్తే కథ మారుస్తామన్నారు. కానీ అసలు టైం వచ్చే సరికి అడ్రస్ లేకుండా పోయారు. ఒకదశలో మహారాష్ట్ర నేతలు ఫోన్లు చేసినా లిఫ్ట్ చేయలేదు. దీంతో వారంతా తమదారి తాము చూసుకున్నారు.

# కేటీఆర్‌కు చెక్? రేవంత్ మాటల్లోని ఆంతర్యమేంటి?



హైదరాబాద్,అంతా ఫినిష్ అయ్యాక మిగిలేది హరీష్ రావు మాత్రమేనని.. ఆయన్ని ఎలా డీల్ చేయాలో తెలుసని రేవంత్ అన్నారు. ఇది కూడా ఆలోచించాల్సిన విషయమేనని.. రాజకీయ వర్గాలు చెబుతున్నాయ్.కొడుకుతో తండ్రిని ఫినిష్ చేశా.. ఇప్పుడు బావతో బామ్మర్దిని ఫినిష్ చేస్తా.. మీడియాతో చిట్‌చాట్‌లో సీఎం రేవంత్ మాట్లాడిన మాటలివి. ఇంతకీ ఆయన ఏం చేశారు.. ఏం చేయబోతున్నారు.. ఎలా చేయబోతున్నారు.. రేవంత్ మాటలకు అర్థం ఏంటి.. కేటీఆర్‌ను ఎలా ఫినిష్ చేస్తారు.. అసలీ ఫినిషింగ్ రాజకీయాలు ఎక్కడికి దారి తీయబోతున్నాయ్.. తెలంగాణ రాజకీయాల్లో ఏం జరగబోతోంది.బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ టార్గెట్‌గా.. సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు.. తెలంగాణ రాజకీయాలను మరింత మండిస్తున్నాయ్. మీడియా ప్రతినిధులతో చిట్‌చాట్‌లో కేసీఆర్ ఫ్యామిలీపైరేవంత్ హాట్ కామెంట్స్ చేశారు. ఏడాదిలో కొడుకుతో తండ్రిని ఫినిష్ చేశానని మరో ఏడాదిలో రాష్ట్రంలో అసలు కేసీఆర్ ఊసే లేకుండా చేస్తానని ధీమా వ్యక్తం చేశారు.ఇప్పుడు బావతో బామ్మర్దిని ఫినిష్ చేస్తానని బాంబు పేల్చారు? అంటే హరీష్ రావుతో.. కేటీఆర్‌ను ఫినిష్ చేస్తానని చెప్పారన్నమాట. ఇక ఆ తర్వాత మిగిలేది కేవలం హరీష్ రావు మాత్రమేనని.. ఆయనను ఎలా డీల్ చేయాలో తనకు తెలుసంటూ.. సీఎం రేవంత్ చేసిన వ్యాఖ్యలు పాలిటిక్స్‌లో కొత్త చర్చకు కారణం అవుతోంది. ఇప్పటికే భగ్గుమంటున్న రాజకీయం.. ఈ ఫినిషింగ్ టచ్‌తో ఇంకెంత మండుతుందో అనే చర్చ నడుస్తోంది.

### అందుకే అన్నారా?

ఫినిష్ చేశాను.. ఫినిష్ చేస్తా అంటూ సీఎం రేవంత్ మాటలకు అర్థమేంటన్న చర్చ తెలంగాణలో జరుగుతోంది. కేటీఆర్‌తో కేసీఆర్‌ను ఫినిష్ చేశానని.. అసలు రేవంత్ ఎందుకు అన్నారు.. ఏం చేశారు.. ఆయన మాటల్లో ఆంతర్యమేంటని ఆరా తీస్తున్నారరు. తెలంగాణలో రెండు దఫాలు అధికారం చేపట్టిన పార్టీగా జనాల్లో వ్యతిరేకత రావడం.. అదే సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలకు జనాలు ఆకర్షితులు కావడంతో.. బీఆర్ఎస్ ఓడిపోయింది.మరి ఈ మాత్రం దానికి కేటీఆర్‌తో కేసీఆర్‌ను ఫినిష్ చేయించిందేంటి.. అసలేం చేశారు అనే డౌట్‌లు చాలామందిలో తెగవస్తున్నాయట. కేసీఆర్ మౌనం వెనక కాంగ్రెస్ వ్యూహం కానీ.. రేవంత్ ప్లాన్ కానీ ఉందా అంటే.. అదీ లేకపాయె ! ఓడిపోతే ఫాంహౌస్‌కు పోతా ఎన్నికల ప్రచారంలోనే చెప్పిన కేసీఆర్.. ఎన్నికల్లో ఓడగానే అదే పనిచేశారు. ఇందులో కాంగ్రెస్, రేవంత్ చేసిందేంటి.. మధ్యలో కేటీఆర్ ఎందుకు వచ్చారు అని.. ఆలోచనలో పడిపోయారు చాలాంది.ఏడాదిలో రాష్ట్రంలో కేసీఆర్ ఊసే లేకుండా చేస్తానన్న రేవంత్ మాటల వెనక వేరే అర్థం ఉందనే చర్చ జరుగుతోంది. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి మొదలు.. బీఆర్ఎస్ హయాంలో జరిగిన కుంభకోణాలపై విచారణ జరుగుతుండగా.. అందులో కచ్చితంగా కేసీఆర్ జైలుకెళ్లాల్సి వస్తుందని కాంగ్రెస్ నేతలు చెప్తూ వస్తున్నారు. ఆయన జైలుకెళ్తే.. ఇక ఆయన పేరు కనుమరుగైపోతుందని సీఎం రేవంత్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. మరి బావతో అంటే హరీష్‌తో బామ్మర్ధిని అంటే కేటీఆర్ ఫినిష్ చేస్తానని రేవంత్ అన్నారు.

### కాంగ్రెస్ నేతల ఆరోపణ ఏంటి?

దీని అర్థాన్ని డీకోడ్ చేసే పనిలో ఉన్నారు మరికొందరు. ఈ మాటల వెనక భారీ ఆంతర్యం ఉందంటున్నాయ్ రాజకీయవర్గాలు. ఫోన్ ట్యాపింగ్ నుంచి మొదలు.. కార్ రేసింగ్, ధరణి వంటి కేసుల్లో కేటీఆర్ భారీఎత్తున అవినీతికి పాల్పడ్డారన్నది కాంగ్రెస్ నేతల ఆరోపణ. ఆ అంశాలపై విచారణ తుది దశకు చేరుకుందని.. కేటీఆర్‌పై త్వరలోనే కేసులు నమోదవుతాయని.. ఆ తర్వాత అరెస్ట్ అయి జైలుకు వెళ్తారని హస్తం పార్టీ నేతలు చెప్తూ వస్తున్నారు. ఇవన్నీ దృష్టిలో పెట్టుకునే.. కేటీఆర్‌ను ఫినిష్ చేస్తానని రేవంత్ చెప్పి ఉంటారన్న చర్చ జరుగుతోంది. మరి ఇందులో బావ హరీష్ పాత్ర ఏముంది.. బావతో బామ్మర్ది ఫినిషి అని రేవంత్ ఎందుకు అన్నారో.. ఎవరికీ అర్థం కావడం లేదట.అంతా ఫినిష్ అయ్యాక మిగిలేది హరీష్ రావు మాత్రమేనని.. ఆయన్ని ఎలా డీల్ చేయాలో తెలుసని రేవంత్ అన్నారు. ఇది కూడా ఆలోచించాల్సిన విషయమేనని.. రాజకీయ వర్గాలు చెప్తున్నాయ్. ఇక్కడే రేవంత్ చాలా తెలివిగా పొలిటికల్ గేమ్ ఆడుతున్నారని అంటున్నారు. కాంగ్రెస్ నేతలు భావిస్తున్నట్లు.. అవినీతి ఆరోపణల్లో కేసీఆర్, కేటీఆర్ జైలుకెళ్తే.. బీఆర్ఎస్‌కు హరీష్ రావే నాయకత్వం వహించనున్నారని ఊహిస్తున్నారు. ఆయనను తమ దారికి తెచ్చుకోవడం పెద్ద విషయం కాదని.. సీఎం రేవంత్ ఉద్దేశ్యంగా కనిపిస్తోందని పొలిటికల్ సర్కిల్స్‌లో చర్చ జరుగుతోంది. ఇదంతా ఎలా ఉన్నా.. తెలంగాణలో ఫినిషింగ్ రాజకీయాలు ఎక్కడి దారితాస్తాయన్న ఉత్కంఠ సామాన్యల్లో కనిపిస్తోంది.

# పట్టించుకోని ప్రజలు.. పటాకుల మోతతో ఢిల్లీని కమ్మేసిన పొగ



ఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో (ఢిల్లీ) వాయు నాణ్యత మరింత దిగజారింది. దీపావళి సందర్భంగా హస్తిన వాసులు నిషేధాజ్ఞలు ఉల్లంఘించి మరీ పటాకులు కాల్చారు. దీంతో తీవ్రమైన శబ్దకాలుష్యంతోపాటు గాలి నాణ్యత కూడా పడిపోయింది. శుక్రవారం ఉదయం దట్టమైన పొగ కమ్మేసింది. ఎదురుగా ఉన్న వాహనాలు కూడా కన్పించలేనంత పరిస్థితి నేకొన్నది. చాలా ప్రాంతాలలో ఎయిల్ క్వాలిటీ ఇండెక్స్ 350 పాయింట్లు దాటేసింది. దీంతో ప్రజలు ఊపిరి పీల్చుకోవడానికి కూడా ఇబ్బంది పడుతున్నారు.ఉదయం 6 గంటలకు ఢిల్లీలోని ఆనంద్ విహార్, ఆర్కే పురం ప్రాంతంలో గాలి నాణ్యత సూచి ($\%$ూూ$\times\%$) 395 పాయింట్లకు చేరుకుంది. దీనితో పరిస్థితిని 'తీవ్రంగా' పేర్కొన్నారు. అలాగే బురారీ, సోనియా విహార్, పంజాబీ బాగ్, నార్త్ క్యాంపస్, బవానా, జహంగీర్‌పురి, రోహిణి, అశోక్ విహార్, నెహ్రూ నగర్‌లో సూచీ 350 పాయింట్‌లు ఉన్నాయి. గజియాబాద్, గురుగ్రామ్, నోయిడాలో కూడా ఇలాంటి పరిస్థితే ఉన్నది. గురువారం అర్ధరాత్రి నుంచి ఏక్యూఐ పడిపోతూ వచ్చింది.ప్రతి ఏడాది దీపావళి సందర్భంగా వాయు కాలుష్యం తీవ్ర సమస్యగా మారుతుంది. పెద్ద మొత్తంలో పటాకులు కాల్చడం వల్ల గాలిలో హానికరమైన రసాయనాలు పెరుగుతాయి. దీని వల్ల కాలుష్యం అనేక రెట్లు పెరుగుతోంది. ఈ నేపథ్యంలో ఏటా ఢిల్లీలో పటాకుల తయారీ, అమ్మకాలు, వినియోగంపై ప్రభుత్వం నిషేధం విధిస్తూ వస్తోంది. ఇసారీ పటాకులను ప్రభుత్వం బ్యాన్ చేసింది. అయినా ప్రజల ఆంక్షలు పట్టించుకో కుండా పటాకులు పెద్దమొత్తంలో కాల్చడంతో పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. దీంతో ఢిల్లీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అనేక ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా శ్వాసకోశ సంబంధిత సమస్యలతో సతమతమవుతున్నారు.ఎయిర్ క్వాలిటీ అండ్ వెదర్ ఫోర్‌కాస్టింగ్ అండ్ రిసెర్చ్ నివేదిక ప్రకారం.. గాలి నాణ్యత 447కు పడిపోవడం అంటే అది తీవ్ర వాయు కాలుష్యంగా మారవచ్చు. ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ (AQI) 0–100 మధ్య ఉంటే గాలి నాణ్యత బాగా ఉంటుంది, కాలుష్యం లేదు, (AQI) 100–200 మధ్య ఉంటే గాలి నాణ్యత మధ్యస్థంగా ఉందని అర్థం. ఇక (AQI)200–300 మధ్య ఉంటే గాలి నాణ్యత అధ్వాన్నంగా ఉందని,(AQI) 300–400 మధ్య ఉంటే గాలి నాణ్యత ఎక్కువగా ఉందని, (AQI)400–500 మధ్య ఉంటే కాలుష్యం తీవ్ర స్థాయిలో ఉందని అర్థం చేసుకోవచ్చు.

# జమిలి ఎన్నికలపైన మోడీ పక్కా క్లారిటీ !



న్యూఢిల్లీ,దేశంలో జమిలి ఎన్నికలు జరుగుతాయా అంటే కచ్చితమని బీజేపీ నాయకత్వంలోని ఎన్డీయే కూటమి స్పష్టంగా చెప్పేసింది. సర్దార్ వల్లభాయి పటేల్ జయంతి ఉత్సవాలలో పాల్గొన్న ప్రధాని నరేంద్ర మోడీ ఐక్యత గురించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన ఒకే దేశం అన్న నినాదం ఇచ్చారు. ఒకే దేశం ఒకే లక్ష్యం అందరి విధానం కావాలని అన్నారు. భారత దేశం ఐక్యతను పటేల్ గట్టిగా కోరుకున్నారు అని ఆయన గుర్తు చేశారు. ఒకే దేశం ఒకే ఎన్నిక విషయంలో ముందుకు వెళ్తున్నట్లుగా మోడీ స్పష్టం చేసారు.దేశమంతా ఒక్కటి అని చాటి చెప్పేందుకు కేంద్ర ప్రభుత్వం అనేక నిర్ణయాలు తీసుకుందని ఆయన గుర్తు చేశారు. ఒకే దేశం ఒకే ఎన్నికలతో దేశం మరింతగా బలపడుతుందని మోడీ చెప్పడం విశేషం. అంతే కాదు వన్ నేషన్ వన్ రేషన్ అన్న విధానంతో పేదలకు మేలు జరుగుతుందని అన్నారు. తొందరలోనే వన్ నేషన్ వన్ సివిల్ కోడ్ అన్న విధానాన్ని తీసుకుని వస్తామని కూడా ప్రధాని మోడీ చెప్పారు. దీని వల్లనే దేశంలో వివక్షలు తెర పడుతుందని అన్నారు.ఇక అంతే కాదు దేశంలో జమిలి ఎన్నికలు జరగబోతున్నాయని నరేంద్ర మోడీ చెప్పిన విషయాలు చూస్తే కనుక నిజంగా జమిలికి ముహూర్తం దగ్గర పడిందనే అనుకోవాలని అంటున్నారు. వాస్తవానికి 2014 నుంచి బీజేపీ అధికారంలోకి వచ్చాక జమిలి ఎన్నికలను జరపాలని ఆలోచిస్తూ వస్తోంది. అది కాస్తా ఇపుడు కార్యరూపం దాల్చేలా కనిపిస్తోంది.దాంతోనే మోడీ మరోసారి జమిలి ఎన్నికల మీద దేశానికి క్లారిటీ ఇచ్చారు అని అంటున్నారు. జమిలి ఎన్నికలను కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్న మోడీ ఆ దిశగా అడుగులు పడుతున్నాయని కూడా చెప్పేశారు. సాధ్యమైనంత త్వరలోనే ఒక దేశం ఒక ఎన్నికను అమలుపరుస్తామని కూడా ఆయన స్పష్టం చేసారు. తెలిపారు. అంతే కాదు దేశంలో జరిగే జమిలి ఎన్నికలను ఎవరూ అడ్డుకోలేరని కూడా ప్రధాని మోదీ ధీమాను ప్రకటించారు.ఈ విధంగా జమిలి ఎన్నికల గురించి ఖచ్చితంగా జరుగుతుందని ప్రధానమంత్రి మోడీ చెప్పడంతో మరోసారి జమిలి ఎన్నికల విషయం ఇపుడు దేశంలో మళ్ళీ చర్చకు వస్తోంది. అంతే కాదు 2027లో దేశమంతా ఒకేసారి ఎన్నికలు జరిగే అవకాశాలను కేంద్రం పరిశీలిస్తోందని అంటున్నారు.ప్రస్తుతం చూస్తే 2024 క్యాలెండర్ పూర్తి కావస్తోంది. ఇక మధ్యలో మిగిలింది 2025, 2026 మాత్రమే. ఆ విధంగా చూస్తే కనుక జమిలి ఎన్నికలకు కచ్చితంగా రెండేళ్ల వ్యవధి మాత్రమే ఉంది అని అర్థం అవుతోంది. జమిలి ఎన్నికలను యూపీ ఎన్నికలతో పాటుగానే జరిపిస్తారు అని అంటున్నారు.సో జమిలి ఎన్నికల మీద మోడీ స్పష్టంగా చెప్పేసారు కాబట్టి ఇక జమిలికి దేశమంతా సిద్ధం కావాల్సిందే. అంతే కాదు రాజకీయ పార్టీలు కూడా ఈ రోజు నుంచే తమ పనిలో తాము నిమగ్నం కావాల్సిందే. ఇక ఏపీలో చూస్తే 2027 నాటికి అధికారంలోకి వచ్చి మూడేళ్ళు మాత్రమే పూర్తి అవుతుంది. సో ఆ విధంగా చూసుకున్నా ఒక ఇక మిగిలింది కూటమి ప్రభుత్వానికి రెండేళ్ళ సమయమే అని అంటున్నారు.

# జహీరాబాద్‌లో కాంగ్రెస్‌కు స్ట్రాంగ్ లీడర్ కావాలా?




జహీరాబాద్.. ఒకప్పుడు కాంగ్రెస్ కంచుకోట. తెలంగాణ ఏర్పాటు తర్వాత సీన్ మారింది. బీఆర్ఎస్ అభ్యర్థులు హ్యాట్రిక్ విజయం దక్కించుకున్నారు. ఐతే ఇప్పుడు జహీరాబాద్‌లో కాంగ్రెస్‌కు గెలుపు గుర్రం అవసరం అయింది. ఓ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. దీంతో కాంగ్రెస్‌లో రాజకీయం ఒక్కసారిగా మారిపోయింది. ఇంతకీ జహీరాబాద్‌లో ఏం జరుగుతోంది.. ఎవరి బెర్త్.. ఎవరికి ఎర్త్ పెడుతోంది.మహారాష్ట్ర, కర్ణాటక సరిహద్దుల్లో ఉన్న జహీరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం.. ఒకప్పుడు కాంగ్రెస్ పార్టీకి కంచుకోట. బగారెడ్డి , గీతారెడ్డిలాంటి హేమాహేమీలు ఈ నియోజకవర్గంలో కాంగ్రెస్‌ను తిరుగులేని శక్తిగా నిలిపారు. బాగారెడ్డి మరణం తర్వాత.. గీతారెడ్డితో పాటు దివంగత ఫరీదుద్దీన్.. నియోజకవర్గంపై పార్టీ పట్టు సడలకుండా కాపాడారు. 2018లో గీతారెడ్డి ఓటమితో కాంగ్రెస్ ప్రాబల్యం తగ్గిపోతూ వస్తోంది.వరుసగా రెండుసార్లు బీఆర్ఎస్ విజయం సాధించింది. 2023 ఎన్నికల్లో గీతారెడ్డి పోటీకి దూరంగా ఉన్నారు. దీంతో మాజీ మంత్రి చంద్రశేఖర్ కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో దిగారు. 12వేలకు పైగా ఓట్ల తేడాతో.. బీఆర్ఎస్ అభ్యర్థి మాణిక్ రావు చేతిలో ఓడిపోయారు. గీతారెడ్డి దూరంగా ఉండడం.. చంద్రశేఖర్‌కు నియోజకవర్గ పార్టీ శ్రేణులపై పట్టు లేకపోవడంతో.. జహీరాబాద్‌లో కాంగ్రెస్‌కు కొత్త నాయకుడి అవసరం ఏర్పడిందనే టాక్ నడుస్తోంది. 2018 ఎన్నికల్లో ఓటమి తర్వాత.. గీతారెడ్డి నియోజవర్గానికి రావడమే తగ్గించారు. వయోభారం, అనారోగ్య సమస్యలతో 2023 ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉన్నారు.జహీరాబాద్ ఎంపీపీగా ఉన్న గిరిధర్ రెడ్డి.. పార్టీని నడిపిస్తూ వచ్చారు. గత ఎన్నికల్లో చంద్రశేఖర్‌కు గిరిధర్ రెడ్డి వర్గం గట్టిగానే సపోర్ట్ చేసినా.. గీతారెడ్డి వర్గం నుంచి మాత్రం ఎలాంటి సహకారం అందలేదని తెలుస్తోంది. చంద్రశేఖర్ కోసం గీతారెడ్డి కనీసం ప్రచారం కూడా చేయలేకపోయారు. దీంతో గెలవాల్సిన సీటు కాస్త బిఆర్ఎస్ ఖాతాలోకి వెళ్లిపోయిందనే చర్చ నడుస్తోంది.

### వీరి పరిస్థితి ఏంటి?

ఇక అసెంబ్లీ ఎన్నికల తర్వాత గీతారెడ్డి జహీరాబాద్‌కు వచ్చిందే లేదు. దీంతో ఆమె జహీరాబాద్‌కు దాదాపు దూరం అయినట్లే అనే చర్చ జరుగుతోంది. ఇక కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినా.. చంద్రశేఖర్‌కు ఏ పదవి దక్కలేదు. గిరిధర్ రెడ్డికి మాత్రం సెట్విన్ చైర్మన్ పదవి ఇచ్చారు. ఇప్పుడు జహీరాబాద్ నుంచి స్ట్రాంగ్ లీడర్ కావాలని హస్తం పార్టీ భావిస్తోంది. దీనికోసం రకరకాల ఆప్షన్లు సెర్చ్ చేస్తోంది.బీఆర్ఎస్ నుంచి గెలిచిన మాణిక్‌రావును కాంగ్రెస్‌లో చేర్చుకొని.. పార్టీకి పూర్వవైభవం తీసుకురావాలని హైకమాండ్ ఆలోచిస్తోంది. మాణిక్ రావు కూడా పార్టీ మారే ఆలోచన చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. వరుసగా రెండుసార్లు గెలిచిన మాణిక్ రావును పార్టీలో చేర్చుకోవడంపై.. గిరిధర్ రెడ్డి వ్యతిరేకతేమీ చెప్పడం లేదు. ఐతే చంద్రశేఖర్‌ను పార్టీలోకి తీసుకుంటే.. తన భవిష్యత్‌పై దెబ్బపడుతుందని.. చంద్రశేఖర్ బెంగలో ఉన్నట్లు సమాచారం.ఇక అటు జహీరాబాద్‌కు దూరంగా ఉంటున్న గీతారెడ్డి.. గాంధీ భవన్‌తో మాత్రం టచ్‌లో ఉన్నారు. మాణిక్‌రావును పార్టీలోకి ఆహ్వానించడంలో.. గీతారెడ్డిని పరిగణనలోకి తీసుకోవడంతో పాటు.. జిల్లా మంత్రి దామోదర రాజనర్సింహ అభిప్రాయం తీసుకుంటారు. ఆయన గ్రీన్‌సిగ్నల్ ఇస్తే.. మాణిక్‌రావు రూట్ క్లియర్. ఐతే అదే జరిగితే.. చంద్రశేఖర్‌కు గడ్డపరిస్తితులు తప్పవు. సొంత నియోజకవర్గాన్ని వీడి జహీరాబాద్‌కు వచ్చిన చంద్రశేఖర్‌కు రాజకీయంగా సంకట పరిస్థితి ఎదురయ్యే చాన్స్ ఉంది. దీంతో జహీరాబాద్ రాజకీయంలో ఏం జరగబోతుందనే ఆసక్తి ప్రతీ ఒక్కరిలో కనిపిస్తోంది.

# ఒంటరి నుంచి భవిష్యత్తు దిశగా.. జగన్ సంచలన నిర్ణయం..!



అమరావతి,వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్ పరిస్థితి చాలా ఇబ్బందికరంగా మారింది. ఆయన ఇప్పుడు ఎవరిని నమ్మాలి? అనేది మొదటి ప్రశ్న. కుటుంబాన్ని నమ్మి.. ఆస్తుల విషయంలో వీధిన పడ్డానన్న ఆవేదన జగన్‌లో ఉంది. ఇక, పార్టీలో ఉన్న సామినేని ఉదయభాను, బాలినేని వంటి వీర విధేయులను నమ్మి వారి వల్ల కూడా ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయిందన్న వాదనను మూటగట్టుకున్నారు. ఈ క్రమంలో ఎవరిని నమ్మాలి? అనేది ఇప్పుడు జగన్‌కు పెద్ద పరీక్షగా మారిపోయింది.ఈ పరిణామాలను అంచనా వేసుకున్న జగన్ మరోసారి జనాన్ని నమ్మాల్సిందేనని తీర్మానించుకున్నారు. అయితే.. ఈ సారి అతిగా కాకుండా.. ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగాలని ఆయన నిర్ణయించుకున్నట్టు తెలుస్తోంది. తాజాగా మూడు రోజుల పాటు కడపలో పర్యటించిన జగన్.. తనకు అత్యంత విశ్వసనీయు లైన నాయకులతోఅంతర్గత చర్చలు జరిపారు. సొంత మేనమామ.. రవీంద్రనాథ్‌రెడ్డి(కమలాపురం నియోజకవర్గం), రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి(ప్రొద్దుటూరు), అంజాద్ బాషా(కడప) సహా అత్యంత ముఖ్యులతో సమావేశమయ్యారు.ఈ సమావేశంలో ప్రధానంగా భవిష్యత్తు ప్రణాళికలపైనే చర్చించినట్టు తెలిసింది. నిజానికి ఇప్పుడు పార్టీలో ఎవరు ఉంటారో.. ఎంతమంది వెళ్లిపోతారో కూడా చెప్పలేని పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో పార్టీని కాపాడుకోవడంతోపాటు.. ఎన్నికల సమయంలో పార్టీకి వచ్చిన 40 శాతం(వైసీపీ అంటున్నా.. వచ్చింది 37.86%) ఓటు బ్యాంకును కాపాడుకోవడం, అదేసమయంలో తన ఇమేజ్‌ను దెబ్బతీయాలని అనుకున్న వారికి తగిన విధంగా సమాధానం చెప్పడం అనే కీలక విషయాలపై జగన్ దృష్టి పెట్టినట్టు తెలిసింది.అవసరమైతే.. వచ్చే నాలుగేళ్ల పాటు.. విడతల వారీగా జిల్లాల్లో పాదయాత్ర చేయాలని కూడా భావిస్తు న్నట్టు సమాచారం. అయితే.. దీనిపై పూర్తిస్థాయి నిర్ణయం తీసుకోలేదు. కానీ, ఇప్పటికిప్పుడు మాత్రం.. ప్రజల్లోకివెళ్లాలనినిర్ణయించుకున్నారు. తాను ఒక్కడిగానే.. పార్టీని నిలబెట్టానని. మిగిలిన వారంతా తర్వాత వచ్చారని.. కాబట్టి.. తనకు ఒంటరి తనం కొత్తకాదని ఈ సందర్భంగా.. జగన్ వ్యాఖ్యానించినట్టు అత్యంత విశ్వసనీయ సమాచారం. సో.. దీనిని బట్టి.. మళ్లీ జగన్‌ప్రజల్లోకి వచ్చేందుకే మొగ్గు చూపుతున్నట్టు తెలుస్తోంది.